

కంది క్వింటాల్‌కు రూ.450 అదనం

బెంగళూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కంది పంటకు ఇదివరకే ప్రకటించిన మద్దతు ధర రూ.8 వేలకు అదనంగా రూ.450 ఇచ్చేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీ శాఖ మంత్రి శివానంద పాటిల్ సోమవారం ప్రకటించారు. దీని కోసం రూ.140 కోట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. విజయపుర ప్రభుత్వ అతిథిగృహంలో రాష్ట్ర రైతుసంఘం నాయకులతో ఆయన చర్చించారు. 400కుపైగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నామని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.



వక్కలిగ కార్పొరేషన్ కార్యాలయం

కార్పొరేషన్లలో కాసుల్లేవ్..!

పేరుకే రూ.కోట్లలో గ్రాంట్లు... విడుదల శూన్యం
అభివృద్ధి అయోమయం
కొన్నింటికి వందల కోట్లలో కేటాయింపు
మరికొన్నింటికి నామమాత్రంగా విడుదల


కార్పొరేషన్	కేటాయింపు	విడుదల
	(రూ.కోట్లు)	(రూ.కోట్లు)
ఒక్కలిగ	100	0
దేవరాజ్ అరసు	100	0
వీరశైవ	60	0
విశ్వకర్మ	13	0
ఉప్పార	8	0
ఈడిగ	10	0
నిజశరణ	5	0
తాండ అభివృద్ధి	60	15
బోవి అభివృద్ధి	55	13.75
ఆదిజాంబవ	50	12.50
సఫాయికర్మచారి	25	6.25



బెంగళూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంలో ఏటా బడ్జెట్ గాత్రం పెరిగిపోతూనే ఉంది. కొన్నేళ్ల కిందట రూ.2లక్షలకోట్ల బడ్జెట్ ఉండగా మరికొన్ని రోజుల్లో వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టే బడ్జెట్ రూ.4లక్షల కోట్లకు పెరగనుందని అంచనా. బడ్జెట్‌గాత్రం పెరుగుతున్న తరుణంలో వివిధ కార్పొరేషన్ల ద్వారా వెనుకబడినవర్గాలకు ఉపాధి, విద్య, వ్యాపారం ఇతరత్రా అవకాశాలను కల్పించి వారి జీవన విధానంలో మార్పు తీసుకొస్తున్నామని గొప్పలు చెబుతారు. బడ్జెట్ వేళ ఎన్నో కార్పొరేషన్ల పేర్లు చదివి వినిపిస్తారు. వాటికి కేటాయించిన గ్రాంట్లతో సంబంధిత సామాజికవర్గాలు సంబరపడతారు. తమ సమాజాన్ని ప్రభుత్వం గుర్తించిందని ముఖ్యమంత్రి, మంత్రులు తమపై కరుణ చూపారని సంతోషం వ్యక్తం చేస్తారు. సదరు కార్పొరేషన్ల ద్వారా సన్మానాలు, సత్కారాలు చేస్తారు. అయితే బడ్జెట్‌లో కేటాయించిన గ్రాంటు విడుదల కావాలంటే గగనమే అనిపిస్తోంది. ఇటీవల సీఎం సిద్దరామయ్య కర్ణాటక అభివృద్ధి కార్యక్రమాలు (కేడీపీ) సభలు జరిపారు. బీసీవర్గాలు, సాంఘిక సంక్షేమశాఖ అధికారులతో డిసెంబరు చివరి వరకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బడ్జెట్‌లో గ్రాంట్లు విడుదలైన మొత్తం, ఖర్చు చేసిన విధానం, జిల్లాలవారీగా ఎంతమందికి లబ్ధి అనేది సమీక్షించారు. ఆర్థిక సంవత్సరం 9 నెలలు ముగిసినా కొన్ని కార్పొరేషన్లకు పైసా కూడా గ్రాంటు విడుదల కాలేదనే వాస్తవం వెలుగులోకి వచ్చింది. నివేదికతో సీఎం కాస్త అయోమయంలో పడ్డారు. పలు కార్పొరేషన్లకు అధ్యక్షులను నియమించకుండానే జాప్యం చేస్తున్నారు. కమిటీ ఏర్పడితే బడ్జెట్‌లో వారికి కేటాయించిన గ్రాంట్లకోసం ఒత్తిడి తెస్తారని పైగా వారు మంజూరు చేయాల్సిన పథకాలపై జిల్లాలవారీగా సమీక్ష చేస్తారనే వెనుకంజ వేస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కలిగ అభివృద్ధి మండలి, మరాఠా అభివృద్ధి మండలి, విశ్వకర్మ అభివృద్ధి మండలికి ఇప్పటివరకు ఛైర్మెన్, కమిటీలను నియమించలేదు. కార్పొరేషన్లకు ఛైర్మన్, కమిటీలను నియమించేందుకు హోంమంత్రి పరమేశ్వర్ అధ్యక్షతన ప్రత్యేకమైన కమిటీ ఏర్పాటు చేశారు. సదరు కమిటీ పలుమార్లు సభలు జరిపింది. బోర్డుల, కార్పొరేషన్లకు రెండున్నరేళ్లపాటు ఒక్కొక్కరికి ఛైర్మన్, కమిటీ సభ్యులుగా నియమించాలని చర్చించారు. కానీ ప్రతి కార్పొరేషన్‌కు ఆశావహుల సంఖ్య భారీగా ఉండడంతో ఎటూ నిర్ణయించుకోలేక పోయారు. దీంతో కొన్ని కార్పొరేషన్లకు కమిటీలు ఏర్పాటు చేయలేదు.

సామాజిక, విద్యారంగంలో వెనుకబడిన వర్గాలకు శక్తిని ఇచ్చేలాంటి పథకాలను అమలు చేసేందుకు బోర్డులు, కార్పొరేషన్లు ఏర్పాటయ్యాయి. అయితే పేరుకు మాత్రమే ప్రతి కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. ఎన్నికలవేళ, ఇతరత్రా సందర్భాలలో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తున్నారు కానీ గ్రాంట్లు మాత్రం విడుదల కావడం లేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో రెండు నెలలు మాత్రమే గడువు ఉంది. అయినా గ్రాంట్లు విడుదల కాకపోవడం సర్వత్రా విమర్శలకు కారణమవుతోంది.

దేవరాజ్ అరసు బీసీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారులకు డిసెంబరు చివరినాటికి రూ.25కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. ఒక్కలిగ సముదాయం, వీరశైవ లింగాయత కార్పొరేషన్ ద్వారా చెరో రూ.15కోట్లతో పథకాలు కొనసాగించాల్సి ఉండేది. ఉప్పార అభివృద్ధికి రూ.2కోట్లు, నిజశరణ అంబిగెర చౌడయ్య కార్పొరేషన్‌కు రూ.1.25 కోట్లు, విశ్వకర్మ అభివృద్ధి మండలికి రూ.3.25 కోట్లు, ఈడిగ అభివృద్ధి కార్పొరేషన్‌కు రూ.2.50కోట్లు ఖర్చు చేయాల్సి ఉండేది. ఈ కార్పొరేషన్లకు ఇప్పటివరకు పైసా గ్రాంటు విడుదల కాలేదు. కొన్ని కార్పొరేషన్లు, బోర్డులకు అత్యల్పంగా గ్రాంట్లు విడుదల చేశారు. అలెమారి బుడకట్టు అభివృద్ధి మండలికి బడ్జెట్ రూ.28.78 కోట్లు కేటాయించగా ఇప్పటి వరకు రూ.10.37 కోట్లు విడుదల చేశారు. క్రాంతివీరబ సంగొళ్లిరాయణ్ణ కార్పొరేషన్‌కు రూ.5.01 కోట్లకుగాను రూ.1.25 కోట్లు విడుదల కాగా వీరు పూర్తిగా ఖర్చు చేశారు. వెనుకబడిన వర్గాల విదేశీ విద్య, అధ్యయనం, పోటీ పరీక్షలకు శిక్షణలు, పీహెచ్‌డీ ఫెలోషిప్‌లకు రూ.40కోట్లు కేటాయించగా రూ.19.28 కోట్లు విడుదల చేశారు. బీసీ కార్పొరేషన్‌కు సంబంధించి రూ.191 కోట్లు కేటాయించగా రూ.70.66 కోట్లు మాత్రమే విడుదలైంది. ఇందులో రూ.51.36 కోట్లు ఖర్చు చేసినట్టు తెలుస్తోంది.



బెళగావిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్

నేడు గాంధీ భారత్ సభ

● హాజరుకానున్న రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే

బెంగళూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కుందానగరి మరోసారి సర్వాంగ సుందరమైంది. గాంధీ భారత సభతోపాటు సువర్ణసౌధ ప్రాంగణంలో నిర్మించిన మహాత్మాగాంధీ విగ్రహావిష్కరణ కార్యక్రమాలు మంగళవారం జరగనున్నాయి. సీఎం సిద్దరామయ్య సోమవారం సాయంత్రం బెళగావికి చేరుకున్నారు. ఆయనను కాంగ్రెస్‌వర్గాలు సాదరంగా స్వాగతించాయి. సువర్ణసౌధ ప్రాంగణంలో గాంధీ విగ్రహావిష్కరణ స్థలాన్ని సీఎం సిద్దరామయ్య పరిశీలించారు. డీసీఎం డీకే శివకుమార్, శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్‌తోపాటు మాజీ సీఎం వీరప్పమొయిలీలు పాల్గొన్నారు. మహాత్మాగాంధీ 1924లో స్వాతంత్ర్యసంగ్రామం కొనసాగుతున్న తరుణంలో చారిత్రాత్మకం అనిపించేలా బెళగావి కాంగ్రెస్ సభకు అధ్యక్షత వహిస్తారు. వందేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా భారీగా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. వాస్తవానికి డిసెంబరు చివరివారంలో రెండు రోజుల కార్యక్రమాలు సిద్ధం చేయగా మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ కన్నుమూయడంతో వాయిదా పడింది. దీంతో 21న మంగళవారం గాంధీ విగ్రహావిష్కరణతోపాటు గాంధీ భారత స్మరణార్థం 'జై బాపు, జై భీమ్, జై సంవిధాన్' పేరిట భారీ కాంగ్రెస్ సమావేశం ఏర్పాటు చేయాలని తీర్మానించారు. అందుకు అనుగుణంగానే పదిరోజులుగా కార్యాచరణ కొనసాగుతోంది. డీసీఎం డీకే శివకుమార్ నాలుగురోజులుగా బెళగావిలోనే మకాం వేసి పర్యవేక్షిస్తున్నారు. ఉదయం 10.30 గంటలకు సువర్ణసౌధలో సిద్ధం చేసిన మహాత్మాగాంధీ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ పాల్గొననున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు సీపీఎడ్ మైదానంలో కాంగ్రెస్ సభ జరగనుంది. కాగా గాంధీ విగ్రహావిష్కరణకు అన్ని వర్గాలవారిని ఆహ్వానించారు. మంత్రులు పరమేశ్వర్, హెచ్‌కే పాటిల్, ఎంబీ పాటిల్, జమీర్ అహ్మద్‌తోపాటు పలువురు బెళగావికి చేరుకున్నారు. భారీగా జనసమీకరణతోపాటు కార్యకర్తలు, సీఎం అభిమానులు తరలి రానున్నట్టు కాంగ్రెస్ వర్గాలు ప్రకటించాయి. స్థానిక మంత్రి సతీశ్ జార్కిహొళి సభ విజయవంతానికి కీలకంగా వ్యవహరిస్తున్నారు.



గాంధీ విగ్రహావిష్కరణ ప్రాంతం

బెళగావిలోనే సుర్జేవాలా

గాంధీ భారత సభ విజయవంతం కోసం రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ సుర్జేవాలా బెళగావిలోనే మకాం వేశారు. మూడు రోజులుగా ఇక్కడే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. సభ ఏర్పాట్లను రోజూ స్థానిక నాయకులతో సమీక్షలు సాగిస్తున్నారు. ఇటీవలే రోడ్డు ప్రమాదానికి గురైన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్‌ను సుర్జేవాలా పరామర్శించారు. కాగా బీజేపీ నేత, రాజ్యసభ మాజీ సభ్యుడు ప్రభాకర్ కోరె నివాసానికి డీసీఎం డీకే శివకుమార్ వెళ్లారు.



పొలాల్లోనే వదిలేసిన టమోటా పంట

పొలాల్లోనే వదిలేశారు..

● ధరలు పడిపోవడంతో టమోటా రైతు విలవిల
● కూలి ఖర్చులు భరించలేక పంట కోయడానికీ వెనకడుగు

8

బీజేపీ పదాధికారుల నియామకం

● పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి
● మాజీ మంత్రి లింబావళి పిలుపు

7



బాధ్యతలు అప్పగిస్తున్న మాజీ మంత్రి లింబావళి, ఎమ్మెల్యే మంజుల తదితరులు

అవినీతిపై కొరడా

● బళ్లారి మార్కెట్ సూపర్‌వైజర్ శరణ బసవ సస్పెన్షన్
● ఉత్తర్వులు జారీ



శరణ బసవ

బళ్లారి గాంధీనగర్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): బళ్లారి ఏపీఎంసీ సూపర్‌వైజర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ నెల 15వ తేదీన ఉప లోకాయుక్త జస్టిస్ వి.వీరప్ప ఆకస్మిక తనిఖీలు రాష్ట్ర స్థాయిలో చర్చనీయాంశమైన నేపథ్యంలో రాష్ట్ర ఏపీఎంసీ శాఖ బళ్లారి అధికారులపై కొరడా ఝులిపించారు. బళ్లారి వ్యవసాయ మార్కెట్ సమితిలో మార్కెట్ సూపర్ వైజర్‌గా పనిచేస్తున్న శరణ బసవను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ఏపీఎంసీ డైరెక్టర్ శివానంద కపాసి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉప లోకాయుక్త ఏపీఎంసీలో రైతులకు జరుగుతున్న అన్యాయం గురించి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ఈ నెల 16వ తేదీన రాష్ట్ర ఏపీఎంసీ సమితుల శాఖామంత్రి శివానంద పాటిల్, రాష్ట్ర డైరెక్టర్, స్థానిక ఎమ్మెల్యే భరత్ రెడ్డి, బళ్లారి ఏపీఎంసీ మార్కెట్‌ను సందర్శించి అక్కడ నెలకొన్న సమస్యలపై చర్చలు జరిపారు. మార్కెట్ నిర్వహణలో మార్కెట్ సెక్రటరీ నంజుండస్వామి, మార్కెట్ సూపర్ వైజర్ శరణ బసవపై వస్తున్న ఆరోపణలపై మంత్రి శివానంద పాటిల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే సందర్భంగా పలువురు వ్యాపారులు మార్కెట్‌లో జరుతున్న అవ్యవహారాపై మంత్రి, డైరెక్టర్ దృష్టికి తీసుకు రావడంతో శరణ బవసపై సస్పెండ్ చేస్తూ చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. దీంతో పాటు గతంలో ఏపీఎంసి ఉపాధ్యక్షుడిగా ఉన్న హులియప్ప పదవికి రాజీనామా చేయించడంతో పాటు మార్కెట్‌లో జరుగుతున్న అవ్యవహారాలపై ఏపీఎంసీ డైరెక్టరేట్ కార్యాలయంలో నేరుగా ఫిర్యాదు చేసిన విషయంపై పూర్వపరాలు సేకరించిన అధికారులు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. శరణ బసవ సస్పెండ్‌తో ఏపీఎంసీలో నెలకొన్న సమస్యలు పరిష్కారం కావని, దీర్ఘకాలికంగా పనిచేస్తున్న అధికారులపై చర్యలు తీసుకునే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. అవినీతి బయటకు పొక్కడంతోనే రాష్ట్రసాయి లోకాయుక్త అధికారుల పరిశీలనకు కారణమైంది.

అతిథి అధ్యాపకుల్లో ఆందోళన



● 5 వేల మందిని ఇంటికి పంపే యత్నం ● యూజీసీ నిబంధనల పేరుతో ప్రభుత్వం చర్యలు ● తొలగించేది లేదన్న హామీ ఏమైనట్లు..?

బెంగళూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): దేశంలో ఉన్నత విద్యావిధానం ప్రగతిపథంగా ఉన్న రాష్ట్రంగా పేరొందిన రాష్ట్రంలో ప్రాథమిక నుంచి యూనివర్సిటీల దాకా బోధకులను భర్తీ చేయకుండా ఏటా నిర్లక్ష్యం చేస్తున్నారు. దాదాపు రెండు దశాబ్దాలుగా అతిథి అధ్యాపకులుగా పనిచేస్తున్నవారికి యూజీసీ నిబంధనల పేరిట ఏకంగా ఇంటికి పంపించే ప్రక్రియ ప్రారంభమయ్యింది. ఏకంగా 5,353 మంది అతిథి అధ్యాపకులకు ఒక్కసారిగా ప్రభుత్వం చెక్ పెట్టనుంది. అత్యంత తక్కువ జీతంతోనే డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న వేలాదిమంది అతిథి అధ్యాపకుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారింది.

యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిర్ధారించిన ప్రమాణాలకు అనుగుణంగా అర్హతలేని అతిథి అధ్యాపకులను 2024-25 విద్యాసంవత్సరంలో సేవలు కొనసాగించరాదని ఉన్నత విద్యాశాఖ నిర్ధారించింది. అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలకు యూజీసీ నిర్ధారించిన అర్హత కల్గినవారిని మాత్రమే అతిథి అధ్యాపకులుగా ఎంపిక చేయాలని గత సెప్టెంబరులో హైకోర్టు తీర్పునిచ్చింది. విద్యాసంవత్సరం ప్రారంభమైన రెండు నెలల వ్యవధిలోనే ఈ తీర్పురావడంతో రాష్ట్రమంతటా కళాశాలలు, యూనివర్సిటీలలో గందరగోళం సాగింది. ప్రభుత్వం వద్దకు సమస్య చేరగా సేవలకు భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చింది. అయితే హైకోర్టు తీర్పును ఉల్లంఘించి అమలు చేయడం సాధ్యం కాదు.

రాష్ట్రంలో 440 డిగ్రీ కళాశాలలున్నాయి. 2023-24 విద్యాసంవత్సరంలో 10,976 మంది అతిథి అధ్యాపకులు సేవలు కొనసాగించారు. యూజీసీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సి రావడంతో 5,623 మంది అర్హత సాధించారు. కానీ 5,353మంది యూజీసీ నిబంధనల పరిధిలోకి రావడం లేదు. దీంతో వీరందరినీ ఒకేసారి ఉద్వాసన పలికినట్లయ్యింది. వీరిలో 10-20ఏళ్ల దాకా పనిచేసిన అనుభవం కల్గినవారు ఉన్నారు. డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉండే అసిస్టెంట్ ప్రొఫెసర్లకు 2007-08 విద్యాసంవత్సరంలో జరిగిన నియామకాలలో అవకాశం కల్పించారు. 2009 జులై 11నాటికి ఎంఫిల్ విద్యార్హత లేనివారు కూడా దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా నియమింపబడినవారు ప్రస్తుతం ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందారు. దశాబ్దాల కాలంగా రెగ్యులర్ పోస్టులు ఖాళీగా ఉన్నందున విద్యాసంవత్సరం కొనసాగాలని ఏటా గెస్ట్ లెక్చరర్లను నియమించుకునే ప్రక్రియ కొనసాగింది. ఈ విధానంతోనే కళాశాలలు కొనసాగిస్తూ వచ్చారు.

యూజీసీ నిబంధనల ప్రకారం పీజీతోపాటు ఎన్‌ఈటీ లేదా కే-సెట్‌లో ఉత్తీర్ణులు కావాలి. పీహెచ్‌డీ కూడా తప్పనిసరి చేస్తూ యూజీసీ కొన్నేళ్లకిందట నిబంధనలు విధించింది. రాష్ట్రంలోని కళాశాలలకు నిబంధనలు పాటించాలని గతంలోనే సూచించారు. కానీ దశాబ్దాలకాలంగా పనిచేస్తున్న అతిథి అధ్యాపకులలో 50శాతం మంది పీజీ అర్హత మాత్రమే సాధించారు. వీరికి తక్కువ గౌరవవేతనంతోపాటు బోధనలు కొన్ని పీరియడ్‌లు మాత్రమే ఉన్నందున యూజీసీ నిబంధనలు వర్తించరాదని కోరాయి. మానవత్వ కోణంలో ప్రభుత్వం మూడేళ్ల గడువు ఇచ్చి అటువంటివారికి విద్యార్హత పొందేందుకు అవకాశం కల్పించింది. వారి సేవలు సద్వినియోగం చేసుకోవచ్చునని సూచించింది. ప్రభుత్వం ఇచ్చిన మూడేళ్ల గడువు సోమవారంతో ముగుస్తోంది. అయితే ఇప్పటికీ నిబంధనలకు అనుగుణంగా పీహెచ్‌డీలు, కే-సెట్, ఎన్‌ఈటీ వంటివి పూర్తి చేసుకోలేదు. కోర్టు తీర్పుతో రెండో, నాల్గో, ఆరో సెమిస్టర్‌లకు యూజీసీ నిబంధనలు వర్తించినవారిని మాత్రమే నియమించుకోదలిచారు.




యూజీసీ కార్యాలయం

ఇదే విషయమై అతిథి అధ్యాపకులు మాట్లాడుతూ.. 2004-05లో గెస్ట్ లెక్చరర్‌లుగా చేరామని, అప్పట్లో ఈ నిబంధనలు లేవన్నారు. నెలకు రూ.1200 వేతనంతో పనిచేశామని, ఇటీవల రెండేళ్లుగా విద్యార్హత అనుభవంతో నెలకు రూ.31వేల నుంచి రూ.40వేల వరకు గౌరవవేతనం అందుతోందన్నారు. వేతనం పెరిగిందనే నెపంతో నిబంధనలు తీసుకొచ్చారని ఇలా 5వేలమంది తమ సేవలను కొనసాగించేందుకు వీలులేకుండా పోతోందన్నారు. ఒక్కసారిగా సగంమంది గెస్ట్ లెక్చరర్ల సేవలు లేకుంటే విద్యార్థుల అకడమిక్ పరిస్థితి ఏంటనేది ప్రశ్నార్థకంగా మారుతోంది.

కల్యాణం చూడకనే.. కన్ను మూశాడు..

● ఓ వైపు కుమార్తె వివాహం.. మరోవైపు రోడ్డు ప్రమాదంలో తండ్రి దుర్మరణం
● చిక్కమగళూరులో విషాదకర ఘటన



చంద్రు (ఫైల్)

బెంగళూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): కన్నబిడ్డ పెళ్లి కనులారా చూసి సంబరపడాలని భావించిన తండ్రి ప్రమాదవశాత్తు మృతి చెందినా భార్య, కుమార్తెలకు విషయం తెలపకుండా బంధుమిత్రులు పెళ్లి జరిపించిన హృదయవిదారకర సంఘటన చిక్కమగళూరు జిల్లాలో చోటు చేసుకుంది. తాలూకా కేంద్రమైన తరికెరె లో చంద్రు కుమార్తె దీక్షిత పెళ్లి సోమవారం జరగాల్సి ఉంది. ఆదివారం రిసెప్షన్ వేడుక ఉండేది. ఆదివారం ఉదయం పెళ్లి ఏర్పాట్లలో భాగంగా ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో చంద్రు (45) అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. విషయం కుమార్తె, భార్యకు తెలిస్తే పెళ్లి ఆగిపోతుందని బంధువులు ఎవరూ చెప్పకుండా దాచారు. చంద్రు మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం గదిలో ఉంచారు. రాత్రి రిసెప్షన్ వేళ వధువుతోపాటు తల్లి ఎదురుచూశారు. ఇదే సమయంలో బంధువులు చంద్రు కొన్నిరోజులుగా అలసట లేకుండా పనిచేసి అస్వస్థతకు గురయ్యారని, ఒకరోజు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించడంతో అడ్మిట్ చేశామని చెప్పారు. పెళ్లి సమయానికి వస్తారని రాత్రి దాటవేశారు. ఉదయం వధువు తండ్రి ఎక్కడంటూ ఆరా తీసినా ఎవరూ సమాచారం ఇవ్వలేదు. సోమవారం ఉదయం 10 గంటలకు పెళ్లి వేడుక ముగిసింది. కాసేపటికే చంద్రు మృతి చెందిన విషయం బహిర్గతమయ్యింది. వధూవరులు పెళ్లిబట్టలతోనే నేరుగా ఆసుపత్రికి పరుగులు తీశారు. తండ్రి మృతదేహాన్ని చూసి కుమార్తె రోదించడం అందరికీ కలచివేసింది. వివాహ వేడుకలు విషాదంతో ముగియడంతో అందరూ కన్నీరు మున్నీరయ్యారు.

వడ్డెర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా దేవళ్ల మురళి



దేవళ్ల మురళిని సన్మానిస్తున్న కుంచెపు వెంకటేష్ తదితరులు

అనంతపురం అర్బన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వడ్డెర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవళ్ల మురళి ఎంపికయ్యారు. శ్రీశైలంలోని వడ్డెర్ల సంఘం కార్యాలయంలో సోమవారం రాష్ట్ర స్థాయి వడ్డెర్ల సంఘాల నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాకు చెందిన దేవళ్ల మురళిని రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వడ్డెర్ల సంఘం అనంత ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచెపు వెంకటేష్, నాయకులు సుధాకర్, మంజునాథ్, వెంకట రాముడు, లక్ష్మన్న, అంజినప్ప తదితరులు దేవళ్ల మురళికి పూల మాలలు వేసి సన్మానిం చారు. సంఘం పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భం గా దేవళ్ల మురళి మాట్లాడుతూ... వడ్డెర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా చొరవ చూపుతానని పేర్కొన్నారు.

మేనేజ్‌మెంట్ సీట్ల భర్తీకి మార్గదర్శకాలు జారీ

అమరావతి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీలో అనుసరించాల్సిన మార్గదర్శకాలను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. ప్రైవేట్ ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల తరహాలో మేనేజ్‌మెంట్ కోటా(కేటగిరి-బి) సీట్లను భర్తీ చేయాలని స్పష్టత ఇచ్చింది. అగ్రికల్చర్ బీఎస్సీ(ఆనర్స్)లో కేటగిరి బీ కింద మిగిలిపోయిన సీట్లను మొదట ఈఏపీసెట్‌లో అర్హత సాధించిన వారితో భర్తీ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇంటర్మీడియట్ బైపీసీలో 45%పైగా మార్కులు వచ్చిన ఓసీలకు, బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 40%పైన మార్కులు వచ్చిన వారికి అవకాశం కల్పించాలని, ఇంకా ఖాళీలు ఉంటే మార్కుల శాతాన్ని పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది.

రెండో విడత ఎన్నికలు

అనంతపురం అర్బన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండో విడతలో 28 ప్రాథమిక గొర్రెల పెంపక సహకార సంఘాలకు పాలక వర్గం ఎన్నికలు జరిగాయి. రెండో విడతలో 36 సంఘాలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నింది. సరైన రికార్డులు లేని కారణంగా ఆరు సంఘాలను ఎన్నికలు నిర్వహించలేదు. ఆత్మకూరు మండలం కుర్లపల్లి, గుమ్మఘట్ట మండలం గోళ్లపల్లి సంఘాలకు వెటర్నరీ డాక్టర్లు సెలవులో ఉండటంతో ఎన్నికలు నిర్వహించలేదు. ఈ రెండు సంఘాలకు ఈ నెల 22న ఎన్నికలు నిర్వహించాలని పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. మూడో విడతలో ఈ నెల 25వ తేదీన 35 సంఘాలకు, నాలుగో విడతలో ఫిబ్రవరి 2వ తేదీన 14 సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తారు.

పేదింటి దొడ్డ గుణం

వైద్య కళాశాలకు భర్త మృతదేహాన్ని అప్పగించిన భార్య



భర్త మృతదేహాన్ని వైద్య కళాశాలకు అప్పగిస్తున్న లక్ష్మి

అనంతపురం టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): దానం చేసే మనసుకు పేదరికం అడ్డుకాదని, దొడ్డ గుణాన్ని చాటుకుంది ఓ మహిళ. భర్తను పోగొట్టుకుని పుట్టెడు దుఃఖంలో ఉన్నా సమాజహితం కోసం పరితపించింది. ఆమె రూరల్ మండలం ప్రభాకర్‌చౌదరి కాలనీకి చెందిన లక్ష్మి. చదువు సంధ్యలు, పిల్లలు లేని ఆమె భర్త శంకర్‌రెడ్డి(60)తో కలిసి బేల్దారి పనులకు వెళ్లేది. భార్యభర్తలు ఒకరికొకరు తోడుగా జీవన పయనం సాగిస్తున్న సమయంలో తీవ్రమైన కడుపునొప్పితో ఈ నెల 8న శంకర్‌రెడ్డి జిల్లా సర్వజన ఆస్పత్రిలో చేరాడు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. దీంతో మృతదేహాన్ని ప్రభాకర్‌చౌదరి కాలనీకి తరలించారు. అంత్యక్రియల కోసం పలువురిని ఆమె సాయం అర్థించింది. ఈక్రమంలోనే సాయిట్రస్టు అధ్యక్షుడు విజయసాయి అక్కడికి వెళ్లి మృతదేహాన్ని వైద్య కళాశాలకు దానం చేస్తే వైద్య విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని మృతుడి భార్య లక్ష్మికి వివరించాడు. ఆమె పెద్దమనసుతో అందుకు అంగీకరించి, కళాశాల వరకు వచ్చి మృతదేహాన్ని అప్పగించారు. ఆమెను వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు మాణిక్యాలరావు అభినందించారు.

మా బతుకులు మార్చండి

మెడికల్ పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు



ర్యాలీ నిర్వహిస్తున్న మెడికల్ పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీలు

అనంతపురం టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): 'అనేక సంవత్సరాలుగా చాలీచాలని జీతాలతో పనిచేస్తున్నాం. అయినా ప్రతినెలా జీతాలు ఇవ్వరు. ఉద్యోగ భద్రతలేదు. ఎన్నిప్రభుత్వాలు మారినా మా బతుకులు మారడం లేదు. ఇప్పుడైనా మార్చండి' అంటూ మెడికల్ పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వైద్య కళాశాల పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు పెద్దఎత్తున జిల్లాకేంద్రంలో ఆందోళన చేపట్టారు. తొలుత జిల్లా ఆస్పత్రి నుంచి అనంతపురం ఆర్డీఓ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి అక్కడ ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్‌కు తరలివచ్చి జేసీ శివనారాయణ శర్మను కలిసి, వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రాజారెడ్డి మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోతే ఆకుటుంబాలు ఎలా బతకాలని మడిపడ్డారు. ఈపీఎఫ్, ఈఎస్ఐలు కూడా చెల్లించకుండా మోసం చేస్తున్నారన్నారు. జీతాలు ఇవ్వకుండా కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్న సంబంధిత ఏజెన్సీపై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడు, నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు, నాయకులు మనోహర్, చిరంజీవి, నల్లమ్మ ప్రశాంత్, భార్గవి, శోభారాణి, హమీదవన్నూర్, స్వరూప, నారప్ప పాల్గొన్నారు.

30న జడ్పీ సర్వసభ్య సమావేశం

అనంతపురం విద్య, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 30న నిర్వహించనున్నారు. జడ్పీలోని ప్రధాన సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలోని జడ్పీ చైర్మన్, మంత్రులు, జడ్పీ వైస్ చైర్మన్లు, శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఇతర కార్పొరేషన్ల చైర్మన్లు, అన్ని శాఖల అధికారులకు సమాచారం అందించారు.

చెప్పండి.. వింటాం..!

- ఎస్సీ వర్గీకరణపై అభిప్రాయ సేకరణ
- జిల్లాలో ఏకసభ్య కమిషన్ పర్యటన
- కలెక్టరేట్‌లో ఎస్సీల వినతుల స్వీకరణ
- సుప్రీం తీర్పును వెంటనే అమలు చేయాలి
- మాదిగ సామాజికవర్గం వినతి
- వర్గీకరణ రాజకీయ ప్రేరేపితం
- మాల సామాజికవర్గం అభ్యంతరం

అనంతపురం టౌన్/సెంట్రల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉప కులాల వర్గీకరణ అంశంపై ఆయా సామాజికవర్గాల ప్రజలు, సంఘాల నాయకుల అభిప్రాయాలను సేకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్ జిల్లాలో పర్యటించింది. కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో ఏకసభ్య కమిషన్, విశ్రాంత ఐఏఎస్ రాజీవ్ రంజన్ మిశ్రా సోమవారం అభిప్రాయాలను తెలుసుకుని, వినతి పత్రాలను స్వీకరించింది. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఎస్సీ ఉప కులాల సంఘాల నాయకులు, కులాల ప్రతినిధులు తరలివచ్చారు. రాజీవ్ రంజన్ మిశ్రాతోపాటు అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ తదితరులకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకూ వినతి పత్రాలను సమర్పించారు. వినతిపత్రాలు ఇచ్చేందుకు వచ్చినవారికి అధికారులు అనేక ప్రశ్నలు వేస్తూ, వారి అభిప్రాయాలను రికార్డు చేసుకున్నారు.



మాట్లాడుతున్న రాజీవ్ రంజన్ మిశ్రా, చిత్రంలో రెండు జిల్లాల కలెక్టర్లు, అధికారులు

అక్షరాస్యులు 2.90 లక్షల మంది

ఉమ్మడి జిల్లా జనాభాలో ఎస్సీలు 14.29 శాతం ఉన్నారు. వీరిలో 2.90 లక్షలమంది మాత్రమే చదువుకున్నారు. మిగిలిన వారు నిరక్షరాసులు. 2014-2025 మధ్య పదో పదవ తరగతి వరకూ చదువుకున్న విద్యార్థుల్లో మాదిగలు 1,44,006 మంది, మాల, మాల అయ్యవారు 20,473 మంది, ఆది ఆంధ్ర 445 మంది ఉన్నారు. చమర్, మౌచి, ముచ్చి 139 మంది, మాల దాసరి 1688, హోలియా దాసరి ఒకరు ఉన్నారు. డామ్, డొమ్మర, పైడి, పానో ఐదుగురు, అరయ్‌మాల 231 మంది, అర్వమాల ఒకరు ఉన్నారు. బరికి ఐదుగురు, ఆది ద్రావిడ 15, జగ్గలి ఐదుగురు, చాలవాడి 18, ముండాల ఒకరు, డక్కల్, డొక్కల్‌వార్ 45 మంది, మాదిగ దాసు, మస్టీ ఇద్దరు, మహర్ ఒకరు, మలసాలి, నెట్కానివారిలో ఇద్దరు చదువుకున్నారు. పాకీ, మోటి, తోటి, వల్లువాన్ కులాల్లో ఒక్కరు కూడా పదోతరగతి చదివిన వారు లేరు. ఇంటర్మీడియేట్ 92,096 మంది, పాలిటెక్నిక్, ఐటీఐ 16,759 మంది, డిగ్రీ 1,02,720 మంది, ఇంజనీరింగ్, ఫార్మసీ, ట్రిపుల్ ఐటీ 27,019 మంది విద్యార్థులు అడ్మిషన్ అయ్యారు.

ఉమ్మడి జిల్లాలో ఎస్సీలు

కులాలు 49
జనాభా 5.83 లక్షలు
పురుషులు 2.92 లక్షలు
స్త్రీలు 2.90 లక్షలు
అక్షరాస్యులు 2.90 లక్షలు
ఉద్యోగులు 48,080

ఇదీ జనాభా

ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ జనాభాలో కులాలవారీగా మాదిగలు 4,75,632 మంది, మాలలు 73,525 మంది ఉన్నారు. ఆది ఆంధ్రా 5,802 మంది, మాదాసి కురువ 786 మంది, చమర్, మౌచి, ముచ్చి 741, మంది, మాలదాసరి 430 మంది, హోలియ దాసరి 409 మంది, డామ్, డొమ్మర, పానో 342 మంది, అరయ్ మాల 285, అర్వమాల 283 మంది ఉన్నారు. బరికి 197, ఆది ద్రావిడ 189, జగ్గలి 121, చాలవాడి 83, ముండాల 81, వలువాన్ 64, డక్కల్, డొక్కల్‌వార్ 61 మంది ఉన్నారు. పాకి, మోటి, తోటి 54 మంది, దోర్ 48, యల్లమలవార్ 43, మాదిదాసు, మస్టీన్ 39, మస్ని 31, గోసంగి 25, జాంబువులు 24 మంది ఉన్నారు. హోలయ 18, మాలసన్యాసి 13, చచాటి 12, మహర్ 11, మాలసాలి, నెట్కాని 11, మాలజంగం 9 మంది ఉన్నారు. అరుంధతీయ 6, చంబర్ 6, దండాసి 5, మస్టీ 5, మటంగి 5, బయగారా, బయగారి 4, మాలదాసు 4, గాసి, హడ్డి 3, పామిడి 3, సిందోళ్లు, చిందోళ్లు 3, యటల 3, అనాముక్ 2, బైండ్ల 2, మాంగ్ 2, మెహ్టర్ ఇద్దరు ఉన్నారు. మాలహనయ్, మాలమస్టీ, సాంగారా, సంబన్ ఒక్కొక్కరు ఉన్నారు.

స్పష్టమైన సమాచారం ఇవ్వండి: కమిషన్

ఉమ్మడి అనంతపురం జిల్లా సమగ్ర సమాచారాన్ని స్పష్టంగా ఇవ్వాలని ఏకసభ్య కమిషన్ విశ్రాంత ఐఏఎస్ రాజీవ్‌రంజిత్ మిశ్రా ఉమ్మడి అనంతపురం జిల్లా అధికారులను ఆదేశించారు. అభిప్రాయ సేకరణ ముగిసిన తరువాత ఆయన కలెక్టర్లు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో ఎస్సీ సామాజికవర్గ ఉద్యోగుల వివరాలు, విద్యార్థుల వివరాలు, గ్రూప్1, 2 గ్రూప్ 3, 4 అధికారులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల వివరాలు, సంక్షేమ పథకాలు(జనాభా నిష్పత్తిలో) తదితర వివరాలను ఆయన కోరారు. ఇప్పటికే తయారు చేసిన నివేదికను రెండు జిల్లాల కలెక్టర్లు కమిషన్‌కు అందజేశారు.



సమస్యలను నోట్ చేసుకుంటున్న రాజీవ్‌రంజన్‌మిశ్రా

వెంటనే అమలు చేయండి

ఎన్నో ఏళ్లుగా వర్గీకరణ కోసం ఎదురు చూస్తున్నామని, సుప్రీం కోర్టు తీర్పును వెంటనే అమలుచేసి తమకు న్యాయం చేయాలని మాదిగ సంఘాల నాయకులు, ఆ సామాజికవర్గ ప్రజలు కోరారు. మాదిగల చరిత్రను ఏక సభ్య కమిషన్‌కు వివరించారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ శాతాన్ని పెంచాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు కోరారు.



వర్గీకరణతోనే న్యాయం అంటూ మోకాళ్లపై కూర్చొని వేడుకుంటున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మాకూ న్యాయం చేయండి..

తాము ఎస్సీ జాబితాలో ఉన్నామో లేదో తెలియడం లేదని బుడగ జంగాల సామాజికవర్గం వారు కమిషన్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. రిజర్వేషన్‌పై స్పష్టతలేక తమ పిల్లలు చదవలేకపోతున్నారని, తమకు న్యాయం చేయాలని విన్నవించారు. తమకు ఎస్సీ సర్టిఫికెట్లు జారీ అయ్యేలా చూడాలని కోరారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని ఆ సామాజికవర్గం నాయకులు ఏకసభ్య కమిషన్‌కు విన్నవించారు.



కంటతడిపెట్టి చెబుతున్న బుడగజంగాల నాయకుడు

ఇవీ గణాంకాలు

ఏకసభ్య కమిషన్‌కు ఉమ్మడి జిల్లా కలెక్టర్లు ఎస్సీల గణాంకాలతో పూర్తిస్థాయి నివేదికను అందజేశారు. నివేదికలో కులాలు, కులాలవారీగా జనాభా, స్త్రీ, పురుషులు, ఉద్యోగులు, అక్షరాశ్యులు, నిరక్షరాశ్యుల తదితర అంశాలను పొందుపరిచారు. 2011 గణాంకాల ప్రకారం ఉమ్మడి జిల్లా జనాభా 40.81 లక్షలు. ఇందులో ఎస్సీలు 5.83 లక్షల మంది. వీరిలో పురుషులు 2.92 లక్షల మంది, స్త్రీలు 2.90 లక్షల మంది ఉన్నారు. ఎస్సీ విభాగంలో 49 కులాలు ఉన్నాయి. ఇందులో మాదిగ, మాల జనాభా అత్యధికంగా ఉంది. ఉమ్మడి జిల్లాలో 48,080 మంది ఎస్సీలు ప్రభుత్వ శాఖల్లో 2014-24 మధ్య ఉద్యోగాలు పొందారు.

48,080 మంది ఉద్యోగులు

ఉమ్మడి జిల్లాలో ఎస్సీ సామాజికవర్గానికి చెందిన 48,080 మంది వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్నారు. 2014-24 మధ్య కులాలవారిగా గ్రూప్1, 2, 3, 4 కేడర్లలోనూ, క్లాస్-4, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో వీరు ఉద్యోగాలు పొందినట్లు నివేదికలో పేర్కొన్నారు. కులాలవారిగా మాదిగలు 31,884 మంది, మాలలు 14,298 మంది, ఇతరులు 1,898 మంది ఉద్యోగాలలో ఉన్నారు. నివేదికలో వరుస సంఖ్య 29, 41లో టెక్నికల్ ఎడ్యుకేషన్ పాలిటెక్నిక్ కళాశాలలు, 14, 34 వరుస సంఖ్యలో సెరికల్చర్ డిపార్ట్‌మెంట్‌ను రెండు సార్లు చూపించింది.

వర్గీకరణ వద్దు..



వర్గీకరణ సరికాదంటూ వినతిపత్రం అందజేస్తున్న మాల నాయకులు

వర్గీకరణ అన్యాయమని, రాజకీయ ప్రయోజనాల కోసం ఎస్సీల మధ్య చిచ్చు పెడుతున్నారని మాల సామాజికవర్గం నాయకులు, ఆ కుల సంఘాల నాయకులు కమిషన్‌తో అన్నారు. రిజర్వేషన్‌లు పెంచి ఎస్సీ కులాలకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రాలను సమర్పించారు.

పాడి పడకుండా..!

- పాడి రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం
- సబ్సిడీపై మినీ గోకులాల మంజూరు
- నామమాత్రంగా రైతు వాటా



సంజీవపురంలో నిర్మించిన మినీగోకులం షెడ్డు

గార్లదిన్నె, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు, గొర్రెలు, మేకల కాపరులకు రాయితీతో ప్రభుత్వం మంజురు చేసిన మినీ గోకులం షెడ్లు వరంగా మారాయి. గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులు, గొర్రెలు, మేకలు పెంపకదార్లు తడకలు, కట్టెలతో చిన్న చిన్న పాకలు నిర్మించుకుని అందులో జీవాలను ఉంచేవారు. దీంతో కొన్ని జీవాలు వానాకాలంలో వర్షానికి తడుస్తూ, చలికి వణుకుతూ రోగాల బారినపడి మృతి చెందేవి. పాడి రైతులు రూ.లక్షల్లో నష్టపోతుండేవారు. ఈనేపథ్యంలో పాడి రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయడంతోపాటు పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు ఎన్డీఏ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈక్రమంలోనే రాయితీతో మినీ గోకులం షెడ్లు మంజురు చేసింది. ఐదెకరాలలోపు భూమి ఉన్న చిన్న సన్నకారు రైతులకు ఈ అవకాశం కల్పించింది.

షెడ్డును బట్టి నిధులు

రెండు పశువుల షెడ్డు నిర్మాణానికి రూ.1.15 లక్షలు కేటాయించారు. ఇందులో ఉపాధి నిధులు రూ. 103500, రైతు వాటా రూ. 11500లుగా నిర్ణయించారు. నాలుగు పశువుల షెడ్డు యూనిట్‌కు రూ. 1.85లక్షలుగా నిర్ణయించారు. ఇందులో ఉపాధి నిధులు రూ. 166500, రైతు రూ. 18500 చెల్లించాలి. ఆరు పశువుల షెడ్డు యూనిట్‌ను రూ.2.3 లక్షలుగా నిర్ణయించారు. ఉపాధి నిధులు రూ.207000, రైతు వాటా రూ. 23వేలు గా నిర్ణయించారు. 20 గొర్రెలు, మేకలు షెడ్డు యూనిట్‌కు రూ.1.3లక్షలు నిర్ణయించారు. ఇందులో ఉపాధి నిధులు రూ.91వేలు, రైతు వాటా రూ. 39వేలుగా ప్రకటించారు. 50 గొర్రెల యూనిట్ రూ.2.3లక్షలు, ఉపాధి నిధులు రూ.1.6లక్షలు, రైతువాట రూ. 69వేలుగా నిర్ణయించారు. 100 కోళ్ల షెడ్ రూ. 87వేలు, ఉపాధి నిధులు రూ. 60900, రైతువాటా రూ. 26వేలు, 200 కోళ్లషెడ్డుకు రూ. 1.32లక్షలు, ఉపాధినిధులు రూ. 92400, రైతు వాటా రూ. 39600 ఇలా యూనిట్‌లను ప్రభుత్వం మంజురు చేసింది. పశువులు షెడ్ నిర్మాణాలకే రైతులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. మండలంలో వందకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి మండలానికి సుమారు 46 మినీ గోకులం షెడ్లు రాగా, ఇప్పటి వరకు దాదాపు 26 షెడ్ల నిర్మాణాలు పూర్తి అయినట్లు తెలిపారు. మిగిలిన షెడ్లు వివిధ దశల్లో నిర్మాణాలు జరుగుతున్నట్లు సమాచారం.

పశువులు సురక్షితం



మినీగోకులం షెడ్లలో పశువులు సురక్షితంగా ఉంటాయి. గతంలో షెడ్డు నిర్మించుకునేందుకు ఆర్థిక స్తోమత లేక టెంకాయ పట్టలతో కొట్టం వేసుకున్నాం. ఎండకు, వానకు తడిసి పశువులు అనారోగ్యానికి గురవుతుండేవి. గతంలో మా ఆవు మృతి చెందడంతో సుమారు రూ.40వేలు నష్టపోయాం. ప్రస్తుతం ఐదు ఎనుములున్నాయి. ప్రభుత్వం సబ్సిడితో ప్రవేశపెట్టిన మినీగోకులం షెడ్లు పాడిరైతులకు వరం.

- నర్రిశెట్టి స్వాతి, మహిళా రైతు, సంజీవపురం

పాడి రైతులకు వరం



మండలంలో చిన్న, సన్నకారు రైతులు అధిక సంఖ్యలో పాడిపరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. సొంతంగా షెడ్లు నిర్మించుకోవాలంటే సుమారు రూ. రెండు లక్షలకు పైగా ఖర్చు అవుతుంది. ప్రస్తుతం మాకు 5 ఎనుములు, ఒక ఆవు ఉంది. వీటికి సొంతంగా షెడ్డు నిర్మించాలంటే దాదాపు రూ.4 లక్షల వరకు ఖర్చు అవుతుంది. ఈ క్రమంలో పాడిరైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం మినీగోకులం షెడ్లు మంజురు చేసి చేయూత నందిస్తోంది.

- బుల్లే రామకృష్ణ, గార్లదిన్నె

వేగంగా షెడ్ల నిర్మాణం

మినీ గోకులం షెడ్లు నిర్మించుకునేందుకు పాడి రైతులు ఎక్కువ ఆసక్తి కనబరుస్తున్నా రు. మండలానికి 46 ఉండగా 100కు పైగా దరఖాస్తులు వచ్చాయి. షెడ్లు మంజురైన రైతులందరు నిర్మాణాలు వేగవంతం చేసుకుంటున్నారు. మొదటి విడతలో రాని రైతులకు రెండో విడతలో వస్తాయి. మినీగోకులం షెడ్లు నిర్మాణాలు పూర్తి అయిన వాటికి బిల్లులు కూడా మంజురవుతున్నాయి.

- యోగానందరెడ్డి, ఎంపీడీఓ

రంజీ జట్టులో వినయ్‌కు చోటు



అనంతపురం క్లాక్ టవర్, జనవరి 20(ఆంధ్ర జ్యోతి): ఆంధ్రా రంజీ జట్టుకు జిల్లాకు చెందిన వినయ్‌కుమార్ ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన విజయహజారే ట్రోఫీ, సయ్యద్‌ముస్తాక్ అలీ ట్రోఫీలలో మెరుగైన ప్రతిభ చాటిన వినయ్‌కుమార్‌కు ఆంధ్రా రంజీ జట్టులో చోటు కల్పించారు. రంజీ జట్టులో చోటు సాధించిన వినయ్‌కుమార్‌కు జిల్లా క్రికెట్ సంఘం ఇన్‌చార్జి సెక్రటరీ భీమలింగారెడ్డి అభినందనలు తెలిపారు.

నవోదయ హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

లేపాక్షి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జవహర్ నవోదయ పాఠశాల 9వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశానికి హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 2025-26 సంవత్సరానికి 1084మంది దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. ఫిబ్రవరి 8న జవహర్ నవోదయ విద్యాలయం లేపాక్షి, ఏపీఆర్‌జేసీ స్కూల్‌నందు పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. అదే విధంగా 11వ తరగతిలో ప్రవేశం పొందేందుకు 1228 మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. వీరికి ఫిబ్రవరి 8న హిందూపురంలోని నాలుగు పరీక్షా కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. హాల్‌టిక్కెట్ల కోసం వెబ్‌సైట్‌నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాలమ్...

గోపానందనాథులు (జయంతి)



నందవరీక మహాయోగి శ్రీశ్రీశ్రీ గోపానందనాథులు 1907 జనవరి 21న తిరుపతిలో జన్మించారు. వేదాలపై అపారజ్ఞానం కల్గిన వారు. శ్రీదేవీ ఆరాధనతో మోక్ష మార్గ సాధనపై పరిశోధనలు చేశారు. అమ్మవారి అనుగ్రహం పొందేందుకు సప్తశతీ మార్గంగా సూచించారు. మంత్రవిభాగం నుంచి 921 పూర్ణమంత్రాలను సూత్రీకరించారు. దేవీ మహాత్మ్యం రచన ఎంతో పేరొందింది. సనాతన ధర్మానికి పలు మార్గదర్శకాలు చేశారు. పలు ఆధ్యాత్మిక రచనలు చేశారు. 2003 డిసెంబరు 21న పరమపదించారు.

జి అరవిందన్ (జయంతి)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత గోవిందన్ అరవిందన్ 1935 జనవరి 21న కేరళ రాష్ట్రం కొట్టాయంలో జన్మించారు. సినీ దర్శకుడు, స్క్రీన్ రైటర్, సంగీత దర్శకుడు, కార్టూనిస్ట్, చిత్రకారుడిగా బహుముఖ ప్రజ్ఞాశాలి. మళ యాళ సినీరంగంలో ఎంతో పేరొందారు. సినీరంగం లోకి ప్రవేశించకముందు మాతృభూమిలో కార్టూనిస్ట్‌గా పనిచేశారు. డాక్యుమెంటరీలు, నాటకాలు రూపొందించడంతోపాటు ఇతరుల సినిమాలకు సంగీత దర్శకత్వం వహించారు. కేరళ రాష్ట్ర అవార్డులతోపాటు జాతీయ పురస్కారాలు పొందారు. 1991 మార్చి 15న కన్నుమూశారు.

సంజయ్ సుబ్రమణ్యన్ (పుట్టినరోజు)



సంజయ్ సుబ్రమణ్యన్ 1968 జనవరి 21న చెన్నైలో జన్మించారు. కర్ణాటక సంగీతంలో పేరొందారు. వర్థమాన గాయకులను ప్రోత్సహించేలా యూత్ అసోసియేషన్ ఆఫ్ కర్ణాటిక్ మ్యూజిక్ (వైఏసీఎం)ను స్థాపించారు. తమిళనాడు మ్యూజిక్ ఫెస్టివల్‌లో ప్రముఖ కళాకారుడిగా ఉన్నారు. సంగీత కళా నిధి, ఇసై పెరారిగ్నర్ అవార్డు, గాన పద్మం, గ్లోబల్ ఇండియన్ మ్యూజిక్ అకాడమీ అవార్డు వంటివి అందుకున్నారు.

గౌరవ్ సోలంకి (పుట్టినరోజు)



గౌరవ్ సోలంకి 1997 జనవరి 21న హర్యానా రాష్ట్రం ఫరీదాబాద్ జిల్లా బల్లభ్ఘర్ ప్రాంతంలో జన్మించారు. 52కిలోల విభాగంలో బాక్సింగ్‌లో సత్తా చాటుకున్నారు. 2018 క్వీన్స్‌ల్యాండ్ కామన్వెల్త్ గేమ్స్‌లో బంగారుపతకం సాధించిన తొలి భారతీయుడు. అమెచ్యూర్ బాక్సింగ్ విభాగంలోనూ రాణించారు. అతడి సోదరుడు సౌరవ్ స్థానిక బాక్సింగ్ అకాడమీలో ట్రైనర్‌గా వ్యవహరిస్తుండగా, సోదరి నీలం జాతీయస్థాయిలో 2013 నుంచి 2015 వరకు బాక్సింగ్ ఛాంపియన్‌గా రాణించారు.

యువత సమాజంలో మార్పు తీసుకురావాలి

» నోబెల్ పురస్కార గ్రహీత కైలాశ్ సత్యార్థి

బెంగళూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): యువత సామర్థ్యం సమాజంలో మార్పు తీసుకొచ్చేలా ఉండాలని నోబెల్ పురస్కార గ్రహీత కైలాశ్‌సత్యార్థి అభిప్రాయపడ్డారు. నగరంలోని చాణక్యయూనివర్సిటీ ప్రథమ స్నాతకోత్సవం సోమవారం గ్లోబల్ క్యాంపస్‌లో జరిగింది. చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎంకే శ్రీధర్ అధ్యక్షత వహించగా వైస్‌చాన్స్‌లర్‌లు ఎంపి కుమార్, ప్రొఫెసర్ యశ్వంత్ డోంగ్రెలు పాల్గొన్నారు. విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశాక కైలాశ్ సత్యార్థి మాట్లాడుతూ జీవితంలో కొత్త అడుగులు వేస్తున్నారన్నారు. ఇప్పటివరకు చదువుకున్నారని మీ జ్ఞానం, ఆలోచనలు న్యాయయుత సమాజాన్ని నిర్మించేందుకు బాటలు వేయాలన్నారు. బాలల హక్కులు రక్షింపబడేలా సామూహిక బాధ్యత, జవాబ్దారీతనంగా భావించాలన్నారు. కలలు కనాలని ముందుగా మనకు మనం అన్వేషించుకోవాలన్నారు. సమాజానికి మంచి చేసేందుకు మీ ఆలోచనలు పని చేయాలన్నారు. అనన్యమైన యువ సామర్థ్యం, భావోద్వేగాలకు కాకుండా సకారాత్మక పరిణామాలకు మార్గదర్శకం కావాలన్నారు. వాస్తవ స్థితులను ప్రశ్నించేందుకు వెనుకడుగు వేయరాదన్నారు. సమాజం కోసం నిలబడేలా ఎదగాలన్నారు. చాన్స్‌లర్ ఎంకే శ్రీధర్ మాట్లాడుతూ మూడేళ్ల వ్యవధిలో ప్రతి విద్యార్థి కేవలం అకడమిక్‌లో సాధనే కాకుండా సమాజంపైనా వారిలో మార్పు తీసుకొచ్చే దిశగా బోధనలు సాగించామన్నారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ పంపిన సందేశంలో ఆదర్శం, నైతిక విలువలతో కూడిన సమజానికి చాణక్య యూనివర్సిటీ కృషి చేస్తోందని కొనియాడారు. ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ తొలి వార్షికోత్సవం ద్వారా కొత్త అడుగువేశారని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యాక్సెలర్ వెంచర్స్ చైర్మన్, ఇన్ఫోసిస్ కో-ఫౌండర్ క్రిస్ గోపాలకృష్ణన్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఎంవి చంద్రశేఖర్, మహారాణి క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఎల్ గోమతిదేవి, ఐఐటీ ప్రొఫెసర్ బి మహదేవన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



పట్టాల ప్రదానంలో కైలాశ్ సత్యార్థి, చాన్స్‌లర్ ఎంకే శ్రీధర్ తదితరులు

డిమాండ్ల పరిష్కారానికి కన్నడ సంఘాల నిరసన

చింతామణి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రణలో విఫలం కావడాన్ని ఖండిస్తూ వివిధ కన్నడ సంఘాలతో కలసి కరవే ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. తహసీల్దార్ సుదర్శన్ యాదవ్ అందుబాటులో లేకపోవడంతో రెవెన్యూ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కన్నడసంఘాల ప్రముఖులు అగ్రహార మోహన్, ప్రకాశ్ మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని మండిపడ్డారు. దుకాణాల నామ ఫలకాలలో 60:40శాతం నిష్పత్తిన కన్నడకు ప్రాధాన్యత ఇవ్వాలని ఉన్నా ఆమేరకు అమలు కావడం లేదని ఆరోపించారు. చాలా దుకాణాల నామ ఫలకాలు ఆంగ్లంలోనే ఉన్నాయన్నారు. నిరసనలో శ్రీరామనగర శంకర్, ఆసిఫ్, మంజునాథ్, సత్యనారాయణ్ సింగ్, నారాయణస్వామి, కృష్ణోజిరావ్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేత

ఆలయ అభివృద్ధికి జీతం విరాళమిచ్చిన టీచర్

శిడ్లఘట్ట, జనవరి 20(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ద్యావప్పనగుడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల టీచర్ టీఎస్ మంగళమ్మ తన ఆరాధ్యదైవమైన దక్షిణకన్నడ జిల్లా బంట్వాళ తాలూకా మొంతిమారు దుర్గాపరమేశ్వర ఆలయ అభివృద్ధికి ఒక నెల జీతాన్ని విరాళంగా ఇచ్చారు. కొన్నిరోజులక్రితం అనారోగ్యంతో ఇబ్బంది పడినవేళ దుర్గాపరమేశ్వరికి మొక్కుకున్నారు. ఆరోగ్యం కుదుటపడ్డాక ఆలయ అభివృద్ధికి తన జీతం రూ.75వేలను చెక్కురూపంలో ఆలయ పాలకమండలికి అందచేశారు. ఈ సందర్భంగా మంగళమ్మ, ఆమె భర్త ప్రభు తదితరులు ఉన్నారు.



చెక్కు అందజేస్తున్న టీచర్ మంగళమ్మ

పికార్డ్ బ్యాంకుకు డైరెక్టర్ల ఎంపిక



శిడ్లఘట్ట, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని ప్రాథమిక కృషి, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (పికార్డ్ బ్యాంకు) పాలకవర్గానికి ఐదేళ్ల అవధికి డైరెక్టర్లకుగాను 9మంది జేడీఎస్ మద్దతుదారులు గెలుపొందగా ఐదు స్థానాలతో కాంగ్రెస్ తృప్తిపొందాల్సి వచ్చింది. మురళి, బంకు మునియప్ప, చంద్రనాథ్, ఎంజి సురేశ్, కేఎం భీమేశ్ గెలుపొందారు. శ్రీనివాస్, డీఎన్ రామచంద్ర, భాగ్యమ్మ, ఎంపి రవి, నరసింహప్ప, సునందమ్మ, డీవీ వెంకటేశ్, హెచ్‌కే మంజునాథ్, కేపీ కిశోర్‌లు విజయం సాధించారు. విజేతలను మాజీ అధ్యక్షుడు భీమేశ్, దూగర నాయకనహళ్ళి వెంకటేశ్, మాదేనహళ్ళి రవి, జేడీఎస్ మద్దతుదారుడు బంకు మునియప్ప తదితరులు అభినందించారు.

బీజేపీ పదాధికారుల నియామకం

మహదేవపుర, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని బీజేపీ హోబళి నూతన అధ్యక్షుడిగా దొడ్డనెక్కుంది వార్డుకు చెందిన మాజీ కార్పొరేటర్ శ్రీధర్‌రెడ్డి ఎంపికయ్యారు. మాజీ మంత్రి అరవింద లింబావళి, ఎమ్మెల్యే మంజుళా నేతృత్వంలో అందరి ఆమోదంతో ఎంపిక చేశారు. అనంతరం మాజీ మంత్రి లింబావళి మాట్లాడుతూ హోబళి పరిధిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ తనపై వహించిన బాధ్యతను అందరి విశ్వాసంతో ముందుకు సాగుతానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ గోపినాథ్‌రెడ్డి, బీజేపీ బెంగళూరు కేంద్ర జిల్లా ఎన్నికల అధికారి మంజునాథ్, తాజా మాజీ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, స్థానిక ప్రముఖులు మహేంద్రమోది, ఎల్ రాజేశ్, శ్రీధర్, లోకేశ్ తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకోసం ప్రత్యేక డిజైన్లు

బెంగళూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆదిత్యబిర్లా ఫ్యాషన్ రిటైల్ తస్వ బ్రాండ్ లను నగర ప్రజలకు పరిచయం చేసింది. యూబీ సిటీలో ప్రత్యేక కార్యక్రమం ద్వారా ఆధునిక యువత అభిరుచులకు అనుగుణంగా వధూవరుల డిజైన్లు ఆవిష్కరించారు. డిజైనర్ తరుణ్ తహ్లియాని, రిదా తారా, హరీశ్ క్లోజ్‌పేట్, శైనేశ్‌శెట్టిలు ర్యాంప్‌వాక్ ద్వారా సంప్రదాయ దుస్తులను ప్రదర్శించారు. తరుణ్ తహ్లియాని మాట్లాడుతూ వరుడి వ్యక్తిత్వాన్ని ప్రత్యేకంగా చూపేలా డిజైన్ చేశామన్నారు. ఆధునిక భారతీయ డిజైన్లు మా ప్రత్యేకత అన్నారు. మల్లేశ్వరంలో తొలిశాఖ ఏర్పాటు చేశామని, ప్రస్తుతం ఏడింటికి విస్తరించామన్నారు.

టమోటా కిలో రూ.10

అనంతపురం రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 10తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు 750 టన్నుల టమోటా దిగుబడులు వచ్చా యన్నారు.

చీనీ టన్ను రూ.24వేలు

అనంతపురం రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 24వేలు పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 3వేలు, సరాసరి రూ. 15వేలుతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 46 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

803 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు సోమవారం కృష్ణా జలాల ఇన్‌ఫ్లో 803 క్యూసెక్కులున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. అలాగే ఔట్‌ఫ్లో హెచ్ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 454 క్యూసెక్కులు వెళుతున్నట్లు చెప్పారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.681 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

మద్యం పట్టివేత

హిందూపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కొడికొండ-శిర జాతీయ రహదారిలోని కొల్లకుంట ఫ్లైఓవర్ వద్ద హర్యానా మద్యాన్ని ఎక్సైజ్ సీఐ రామ్మోహన్ సోమవారం తెలిపారు. సుబ్బిరెడ్డిపల్లికి చెందిన శ్రీనాథ్, ముద్దిరెడ్డిపల్లికి చెందిన బాలేంద్ర, నవీన్ కారులో హరియాణా రాష్ట్రానికి చెందిన సుమారు 90 మద్యం బాటిళ్లు తరలిస్తుండగా పట్టుకుని, వాహనాన్ని సీజ్ చేశామన్నారు. నిందితులను అరెస్టు చేశామన్నారు. మద్యం సుమారు రూ.3లక్షలుంటుందన్నారు.

మతిస్థిమితం లేని మహిళ అదృశ్యం

అనంతపురం క్రైం, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఓ మతిస్థిమితం లేని మహిళ అదృశ్యమైంది. నగరంలోని అశోక్‌నగర్‌లో నివాసముంటున్న ఉషారాణి అనే మహిళ కు చిన్నప్పటి నుంచి మతిస్థిమితం ఉండేది కాదు. అప్పుడప్పుడు ఆమె ఇంటి నుంచి వెళ్లిపోయి మళ్లీ తిరిగి వచ్చేది. ఈ క్రమంలో ఈనెల 15న రాత్రి 8గంటలకు ఇంటి నుంచి వెళ్లిపోయింది. తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు సోమవారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అడ్డు తొలగించుకునేందుకే హత్య

● ప్రియుడితో కలిసి భర్తను చంపిన భార్య

హిందూపురం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): వివాహేతర బంధానికి అడ్డు వస్తున్నాడని భర్తను భార్యే.. ప్రియుడితో కలిసి హత్య చేసింది. స్థానిక రహమత్‌పురానికి చెందిన అల్లాబకష్ హత్య కేసును పోలీసులు ఛేదించారు. అల్లాబకష్ భార్య తబస్సుం, ఆమె ప్రియుడు నదీముల్లాను అరెస్టు చేశారు. స్థానిక పోలీసు స్టేషన్ సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో అరెస్టు వివరాలను టూటౌన్ సీఐ అబ్దుల్ కరీం వెల్లడించారు. అల్లాబకష్‌కు తొమ్మిదేళ్ల క్రితం కర్ణాటక రాష్ట్రం దొడ్డబళ్లాపురానికి చెందిన తబస్సుంతో వివాహమైంది. అల్లాబకష్ ఆటోనగర్‌లో బీరువాలు తయారు చేసే షాపులో పనిచేస్తుండేవాడు. రహమత్‌పురానికి చెందిన నదీముల్లా తోపుడుబండ్లపై కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. అతడితో తబస్సుంకు పరిచయం ఏర్పడింది. అదికాస్త వివాహేతర బంధానికి దారితీసింది. విషయం అల్లాబకష్‌కు తెలియడంతో భార్యను పలుమార్లు మందలించాడు. వివాహేతర బంధానికి అడ్డుపడుతున్నాడని భావించిన ఆమె.. భర్తను హతమార్చేందుకు ప్రియుడితో కలిసి పన్నాగం పన్నింది. ఆ మేరకు ఈనెల 18న తెల్లవారుజామున గాఢ నిద్రలో ఉన్న అల్లాబకష్ గొంతుకు చున్నీతో బిగించి, ఊపిరాడకుండా చేసింది. అందుకు ప్రియుడు సహకరించాడు. అల్లాబకష్ చనిపోయాడని నదీముల్లా అక్కడి నుంచి పరాయ్యాడు. కొద్దిసేపటి తరువాత అల్లాబకష్ సోదరికి తబస్సుం ఫోన్ చేసి, 'మీ అన్న ఆరోగ్యం సరిగాలేదనీ, వెంటనే రావాల'ని చెప్పింది. వారు వచ్చి చూసి, అనుమానం రావడంతో నిలదీశారు. దీంతో ఆమె నేరాన్ని ఒప్పుకుంది. పోలీసులు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపట్టారు. ఆ మేరకు తబస్సుం, నదీముల్లాను సోమవారం అరెస్టు చేసినట్లు సీఐ వివరించారు.

యంగ్ ఇండియా రూపకర్త..

కన్నుమూత

- ఉపాధిహామీ హక్కుల ఉద్యమకారుడు నరేంద్రసింగ్ బేడీ మృతి
- వయోభారంతో తుదిశ్వాస



నరేంద్రసింగ్ బేడీ (ఫైల్)

హిందూపురం/పెనుకొం/తనకల్లు/చెన్నేకొత్తపల్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): కరువుకు నిలయమైన ఉమ్మడి అనంతపురం జిల్లాను అభివృద్ధి చేసేందుకు శ్రీకారం చుట్టిన యంగ్ ఇండియా ప్రాజెక్ట్ రూపకర్త నరేంద్రసింగ్ బేడీ (87) ఇకలేరు. వయోభారంతో పెనుకొండ మండలం గుట్టూరు సమీపంలోని ఫాంహౌస్‌లో ఆయన సోమవారం ఉదయం కన్నుమూశారు. అనంతపురం జిల్లాలో పేదరిక నిర్మూలన, సుస్థిరత, మానవహక్కులు, గ్రామీణ జీవన ప్రమాణాల పెంపు, విద్య, వైద్యం, నీటి నిలువలు, ఇంకుడు గుంతలు, వలసల నివారణకు గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలు చేయాలని ఆయన అలుపెరగని పోరాటం చేశారు. పంజాబ్‌లో జన్మించిన ఆయన 55ఏళ్ల క్రితం పెనుకొండ సమీపంలోని గుట్టూరులో యంగ్ ఇండియా ప్రాజెక్ట్ పేరిట స్వచ్ఛంద సంస్థను నెలకొల్పారు. గ్రామీణ ప్రాంత పేద ప్రజలు, రైతుల జీవనోపాధి కోసం అనేక కార్యక్రమాలను చేపట్టారు. ఉపాధి కల్పించారు. గ్రామాల్లో బావులు తవ్వించి, కూలీలకు ఉపాధి కల్పించడంతోపాటు రైతుల జీవనోపాధి కోసం సంస్థ కృషిచేస్తూ వచ్చింది. ఇంధన పొదుపు, సంప్రదాయేతర ఇంధన వనరుల పెంపకం, సేంద్రీయ, సుస్థిర వ్యవసాయం, ఉపాధి కల్పన, జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా అభివృద్ధి వైపు ఉత్తమ పౌర సమాజమే లక్ష్యంగా యంగ్ ఇండియా ప్రాజెక్ట్ పనిచేసింది. ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశ పెట్టడంలో బేడీది కీలకపాత్ర. వ్యవసాయ కూలీల యూనియన్లను ఏర్పాటుచేసి, వాటి ద్వారా ఎన్నో ఉద్యమాలు చేసి నిరుపేదలకు లక్షలాది ఎకరాల ప్రభుత్వ భూమిని పంచడమేకాక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రావాల్సిన సంక్షేమ పథకాలు అందేలా చేశారు. అనేక కార్యక్రమాల ద్వారా పేద ప్రజలను చైతన్యపరిచారు. దివ్యాంగులకు ప్రత్యేక నిధులను సమకూర్చి, వారికి కావాల్సిన పరికరాలను ఉచితంగా పంపిణీ చేశారు. మహిళా సంఘాలను ఏర్పాటుచేసి, ఆర్థికంగా, రాజకీయంగా చైతన్యవంతులను చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలను పోటీ చేయించారు. ఉమ్మడి అనంతపురం జిల్లాతోపాటు రాయలసీమ వ్యాప్తంగా సేవలను కొనసాగించిన ఘనత యంగ్ ఇండియా ప్రాజెక్ట్‌కే దక్కుతుంది. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) రాష్ట్రంలో అమలవుతోందంటే అందుకు యంగ్ ఇండియా ప్రాజెక్ట్ రూపకర్త నరేంద్రసింగ్ బేడీయే కారణమనడం అతిశయోక్తి కాదు. యంగ్ ఇండియా ప్రజెక్ట్‌లో పనిచేసిన అనేక మంది నేడు సొంతంగా స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసుకుని, ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.



బేడీ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న భార్య సోనియా బేడీ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రముఖులు

నేపథ్యం..

నరేంద్రసింగ్ బేడీ పంజాబ్‌లో జన్మించారు. బెంగాల్‌లోని డూన్ పాఠశాలలో చదివారు. అమెరికాలో కెమికల్ ఇంజనీరింగ్ పూర్తి చేశారు. ఆయనకు భార్య సోనియా బేడీ, ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. మణిశంకర్ అయ్యర్, దిగ్విజయ్ సింగ్, ఎంఎస్ స్వామినాథన్.. ఆయన సమకాలికులు. భారత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ.. బేడీకి కళాశాలలో మూడేళ్ల జూనియర్. జాతీయ ఉపాధిహామీ చట్టం రూపకల్పనకు ప్రముఖ ఆర్థికవేత్త హనుమంతరావు తదితర మేధావులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులతో కలిసి పనిచేశారు. యంగ్ ఇండియాలో పనిచేసిన ఇద్దరు క్రియాశీలక సభ్యులు ఎంపీలు అయ్యారంటే సంస్థ పనితీరు ఎలా ఉంటుందో అర్థం అవుతుంది.

పలువురి సంతాపం

నరేంద్రసింగ్ బేడీ మృతి జిల్లా ప్రజలకు తీరనిలోటని పలువురు ప్రజాసంఘాల నాయకులు పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. డా.సురేష్‌బాబు, వెంకటశివారెడ్డి, ఓపీడీఆర్ రామ్‌కుమార్, లయన్స్‌క్లబ్ విరుపాక్షరెడ్డి, తాడికొండ సత్యనారాయణ, పాలిసేని నాగేంద్రప్రసాద్, ఆర్ఈఎఫ్ రామచంద్ర, నాగభూషణం, రామకృష్ణ, పౌరహక్కుల సంఘం, ఎన్‌జీఓ నాయకులు బలరాం, కిష్టప్ప, వెంకటేశ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గంగిరెడ్డి, బలరాం తదితరులు నివాళులు అర్పించారు.

బేడీ మృతి తీరనిలోటు..

బుల్.. బుల్.. అని ప్రేమగా పిలుచుకునే నరేంద్ర సింగ్ బేడీ గ్రామీణాభివృద్ధి రంగంలో మార్గదర్శకుడిగా నిలిచారనీ, ఆయన మృతి తీరనిలోటు అని టింబక్టు కలెక్టివ్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మేరీ, బబ్లూ గంగూలీ పేర్కొన్నారు. నరేంద్రసింగ్ బేడీ మృతిచెందిన విషయం తెలిసిన వెంటనే వారు గుట్టూరు సమీపంలోని యంగ్ ఇండియా ప్రాజెక్ట్‌కు చేరుకున్నారు. ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. కరువు పీడిత రాయలసీమలో వేలాది మంది ప్రజల జీవన ప్రమాణాలను మార్చడంలో కీలక పాత్ర పోషించారన్నారు.

బేడీ మృతి బాధాకరం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అనంతపురం విద్య: నరేంద్ర సింగ్ బేడీ మృతి బాధాకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ సోమవారం ప్రకటనలో సంతాపం వ్యక్తంచేశారు. యంగ్ ఇండియా ప్రాజక్ట్ ద్వారా ఆయన ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేశారన్నారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పథకం అమలు చేయడంలో విశేషంగా కృషి చేశారని గుర్తుచేశారు. జిల్లాకు ఆయన అందించిన సేవలు అపారమన్నారు. ఆయన కుటుంబీకులకు సీపీఐ ప్రగాఢ సానుభూతి తెలియజేస్తుందన్నారు.

ఉపాధి హామీ చట్టం రూపకల్పనలో బేడీ పాత్ర కీలకం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్: యూపీఏ ప్రభుత్వం వ్యవసాయ కూలీల కోసం తెచ్చిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం రూపొందించడంలో యంగ్ ఇండియా రూపశిల్పి నరేంద్రసింగ్ బేడీ పాత్ర కీలకమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఆయన ప్రారంభించిన స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు పేదల అభ్యున్నతికి ఎంతగానో తోడ్పడ్డాయన్నారు. కరువు, రైతు ఆత్మహత్యలు, వలసలు జిల్లా గ్రామీణ జీవితాన్ని విచ్ఛిన్నం చేసినపుడు అనేక సంస్థలతో కలిసి వారికి తోడుగా నిలిచారని గుర్తు చేశారు. ఆయన మృతికి సీపీఎం తరఫున నివాళులర్పిస్తున్నామన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్

పగలే చోరీ

● 47 తులాల బంగారం, రూ.లక్ష అపహరణ



చోరీ జరిగిన ఇంట్లో చెల్లాచెదురుగా పడి ఉన్న వస్తువులు

పెనుకొండ టౌన్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక నారాయణమ్మ కాలనీ సమీపంలో సోమవారం పట్టపగలే ఇంట్లో దొంగలు పడ్డారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నాగార్జున, జ్యోతిలత దంపతులు ఉపాధ్యాయులు. నాగార్జున పెనుకొండ మండలం గుట్టూరు హైస్కూల్‌లో హెచ్ఎంగా పనిచేస్తున్నారు. జ్యోతిలత బాలికల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. ఇరువురు సోమవారం విధులకు వెళ్లారు. దీనిని అదునుగా భావించిన దొంగలు ఇంట్లోకి చొరబడ్డారు. నగలు, నగదు అపహరించారు. సాయంత్రం తిరిగొచ్చిన ఉపాధ్యాయ దంపతులు చూసేసరికి ఇంట్లో బీరువా తెరిచి ఉంది. అందులోని వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. చోరీ అయినట్లు గ్రహించారు. 47 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు చోరీ అయినట్లు బాధితులు.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

అనంతపురం క్రైం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఆత్మహత్యకు యత్నించిన ఓ మహిళ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. వినాయక్‌నగర్‌లో చాకలి శ్రీనివాసులు, యాస్మిన్ (27) దంపతులు నివాసముంటు న్నారు. వీరు 10ఏళ్ల కిందట ప్రేమవివాహం చేసుకున్నారు. వారికి ఇద్దరు కుమారులున్నారు. ఇంటి ఆర్థిక పరిస్థితుల్లో మార్పు రావడం, అప్పులెక్కువ కావడంతో ఈనెల 10న యాస్మిన్ కురులకు వాడే ద్రావకాన్ని తాగి ఆత్మహత్యకు యత్నించింది. ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రైవేట్ ఆసుపత్రిలో అనుమానాస్పద మృతి

అనంతపురం క్రైం, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తున్న సిబ్బంది ఒకరు అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన చాకలి అనిల్(28) నగరంలోని సాయినగర్ 2వ క్రాస్‌లోని మాక్‌నస్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. అతడి డ్యూటీ ఉదయం 9గంటల నుంచి రాత్రి 9గంటల వరకు ఉంటుంది. ఆదివారం మధ్యాహ్నం ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్లాడు. ఏం జరిగిందో తెలియదు. సోమవారం ఉదయం స్వీపర్ ఆ గదిలోకి వెళ్లే సరికి కుర్చీలో కూర్చుని కనిపించాడు. నిద్రపోతున్నట్లు భావించి ఆమె పిలిచింది. పలకకపోయే సరికి భయపడి సిబ్బందికి తెలియజేసింది. ఆసుపత్రి డాక్టర్ హర్షవర్ధన్ పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. టూటౌన్ సీఐ శ్రీకాంత్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. గుండెపోటుతో మృతి చెందాడా..? లేక ఏదైనా విషద్రావకం సేవించాడా..? అనేది తెలియాల్సి ఉంది. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య భారతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1620.98	1,588.89
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	0	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	11.239	0
నీటి నిల్వ (టీఎంసీలు)	64.11	10.13

కేఎంఎఫ్‌లో క్షుద్రపూజలు..!


క్షుద్రపూజలు చేసిన దృశ్యం

బళ్లారి సిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నష్టాల ఊబిలో కూరుకుపోయిన కేఎంఎఫ్(కర్ణాటక మిల్క్ ఫెడరేషన్) పరిపాలన కార్యాలయం ఎదుట సోమవారం ఉదయం క్షుద్రపూజలు వెలుగు చూశాయి. నిమ్మకాయలకు కుంకుమవేసి, గుమ్మడికాయకు కుంకుమ వేసి, గుమ్మడికాయకు మేకు కొట్టి, కొబ్బరికాయకు తాయెత్తు కట్టి, బొమ్మను అందులోఉంచి, మరో కవర్లో ఏదో పెట్టి చేతబడి చేశారు. సెక్యూరిటీ కాపలా ఉన్నప్పటికీ ఈ చేతబడి ఎలా జరిగిందనేది ప్రశ్నార్థకంగా మారింది. ఎన్నికైనపాలక మండలి లేకుండానే పాలకవర్గాన్ని తాత్కాలికంగా కొనసాగించే కేఎంఎఫ్‌ను దోచుకోబోతున్న కొందరు ఇలాంటి పనికి శ్రీకారం చుట్టారని పేరు చెప్పడానికి ఇష్టపడని సిబ్బంది వాపోయారు. ఇంతకు ముందు మన కేఎంఎఫ్ బాగుండేది. ఇంతకాలం ఏం చేయాలనే లెక్కలో మునిగితేలిన వారు నష్టాలబాట పట్టారని అంటున్నారు. నష్టభారాన్ని తగ్గించుకోవడానికి, అవసరమైన ఖర్చులను తగ్గించుకోవాలని సహకార మంత్రి కఠినమైన ఆదేశాలు ఇచ్చారు. ఇలా చేతబడి చేస్తే నష్టం తగ్గుతుందా? సీసీటీవీ, సెక్యూరిటీ సిబ్బంది మధ్య ఎవరూ చేతబడి చేశారో తేల్చాలని కోరుతున్నారు.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యం: ఎమ్మెల్యే

సిరుగుప్ప, జనవరి 20(ఆంధ్ర జ్యోతి): రైతు సంక్షేమంపై దృష్టి సారిద్దామని ఎమ్మెల్యే బీఎం నాగరాజు సూచించారు. సోమవారం సిరుగుప్ప పట్టణంలో వ్యవసాయ సహకార సంఘం నెంబర్ 1లో మొదటి సామాన్యసభ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ రైతుకు జీరో వడ్డీతో రుణాలు కల్పిస్తామన్నారు. డైరెక్టర్లు సభ్యులు రైతుల సమస్యలపై దృష్టిసారించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహకార సంఘం ఉపాధ్యక్షులు దస్తగిరి సాబ్, డైరెక్టర్ ఉరుకుంద, సిద్దప్ప, శేకప్ప, మంజునాథ గౌడ, ఉదుకప్ప, బసవరాజు, కార్యదర్శి బసవరాజు, సహకార్యదర్శి ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

బియ్యం వేలం వాయిదా

సిరుగుప్ప, జనవరి 20(ఆంధ్రజ్యోతి): అక్రమంగా రవాణా చేస్తున్న సబ్సిడీ బియ్యం టెండర్ వాయిదా పడింది. పట్టణంలోని ఏపీఎంసీ మార్కెట్ యార్డు ఆవరణంలో 700 క్వింటాళ్ల సబ్సిడీ బియ్యం వేలంపాటను తహసీల్దార్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభమైంది. ప్రభుత్వం కిలో రూ. 23గా నిర్ణయించి టెండర్ పిలిచారు. టెండర్లో పాల్గొన్న కాంట్రాక్టర్లు క్వింటాలు రూ.2,120కి మాత్రమే పాడారు. నిబంధనల మేరకు వేలం రద్దు చేసి మరోసారి టెండర్లకు పిలవనున్నట్లు తహసీల్దార్ ప్రకటించారు. ఎక్కడైనా అక్రమంగా బియ్యం తరలిస్తే చర్యలు తప్పవని, పేదల బియ్యం పేదలకే చేరాలన్నారు. సివిల్ సప్లై అధికారులు అక్రమాలను అడ్డుకోవాలన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దార్ సత్యమ్మ, ఆహార పౌర సరఫరాల గోడౌన్ మేనేజర్, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

తృణధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం: డీసీ


చిరుధాన్యాల జాతాను ప్రారంభిస్తున్న డీసీ ప్రశాంత్ కుమార్ మిశ్రా


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఉద్యోగులు

బళ్లారి సిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహారాన్ని నిత్యం తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా తెలిపారు. అంతర్జాతీయ చిరుధాన్యాలు, సేంద్రియ సాగులో భాగంగా జిల్లాస్థాయిలో అవగాహన కల్పించేందుకు జిల్లా యంత్రాంగం, జిల్లాపంచాయతీ, వ్యవసాయ శాఖల సహకారంతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని రైల్వేస్టేషన్ రోడ్డులోని జిల్లాకలెక్టర్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన చిరుధాన్యాల వాక్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిరుధాన్యాలు ఆరోగ్యానికి మంచిదని, రసాయనిక ఎరువులు లేకుండా పండించే చిరుధాన్యాలు మరింత ఆరోగ్యకరమన్నారు. జంక్ ఫుడ్ తీసుకోవడం వల్ల చిన్న వయసులోనే ఆరోగ్యం పాడవుతుందన్నారు. ఇటీవలి కాలంలో చిరుధాన్యాల వినియోగంపై అవగాహన పెరగడంతోపాటు చిరుధాన్యాల వినియోగం పెరుగుతోందన్నారు. చిరుధాన్యాలతో ఇటీవల పలు రకాల ఆహారపదార్థాలు తయారు చేస్తున్నారన్నారు.

చిరుధాన్యాల నుంచి వివిధ రకాల వంటకాల తయారీపై అవగాహన కల్పించేందుకు జనవరి 23నుంచి 25వ తేదివరకు బెంగళూరులోని ప్యాలెస్ గ్రౌండ్స్‌లో అంతర్జాతీయ వాణిజ్య ప్రదర్శన, సేంద్రియ, చిరుధాన్యాల జాతా, అగ్రికల్చర్ డైరెక్టర్ సోమసుందర్ తెలిపారు. చిరుధాన్యాల జాతాను జిల్లావ్యవసాయ సంఘం అధ్యక్షుడు ,మహానగర కార్పొరేషన్ సభ్యుడు గాదెప్ప, రైతు నాయకులు పురుషోత్తమగౌడ, ఐనాథ్‌రెడ్డి, ఇతర వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు ప్రారంభించారు.

ఈసందర్భంగా జిల్లా పంచాయతీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప, వ్యవసాయ ఉప సంచాలకులు మంజునాథ్,వ్యవసాయ సహాయ సంచాలకులు దయానంద్,వ్యవసాయ సాధనాల విక్రయదారుల సంఘం అధ్యక్షుడు, వ్యవసాయ అధికారులు, అన్నిశాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

మీలాంటి వారితో పాలన సాగించేదెలా..?

● సమాచారం లేకుండా సమావేశానికి వస్తారా..? ● అధికారులపై మంత్రి సంతోష్ లాడ్ ఆగ్రహం


సమావేశంలో మాట్లాడుతున్న కార్మికశాఖ మంత్రి సంతోష్ లాడ్

రాయచూరు జనవరి 20(ఆంధ్రజ్యోతి): సమగ్ర సమాచారం లేకుండా నిర్లక్ష్యంగా సమావేశాలకు హాజరవుతున్న అధికారుల తీరు పై రాష్ట్ర కార్మిక మంత్రి తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒకదశలో అధికారులిస్తున్న సమాచారం పట్ల సంతృప్తి చెందని కార్మిక మంత్రి సంతోష్ లాడ్ మీలాంటి వారితో ప్రభుత్వం నడపడడం ఏలా? పాలన సాగించేదేలా? అంటు ఆగ్రహం వ్యక్తం చేశారు. కలబుర్గి రెవెన్యూ విభాగానికి సంబంధించి సోమవారం జడ్పీ సమావేశం మందిరంలో కార్మిక శాఖ పై మంత్రి ప్రగతి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో కార్మిక నిబంధనల మేరకు అర్హులుగా ఉన్న కార్మికులు ఎంతమంది వారికి సంక్షేమ పథకాలకు సంబంధించిన ఎన్ని కార్డులు అందాయి? అందులో ఎంత మంది ఏరకమైన ప్రయోజనాలు పొందారు? ప్రభుత్వ పరంగా వారికి అందుతున్న తోడ్పాటు తదితర అంశాల పై మంత్రి అడిగిన ఏ ఒక్క ప్రశ్నకు సంబంధిత అధికారుల నుంచి సరైన సమాచారం రాకపోవడంతో మంత్రి తీవ్ర అసహనానికి ఆగ్రహానికి గురైయ్యారు. అనంతరం మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం పట్ల సంబంధిత శాఖ అధికారులు మరింత క్రియాశీలకంగా వ్యవహరించాలన్నారు. పలు ప్రభుత్వ రంగం సంస్థలకు కార్మికులను అందిస్తున్న ఔట్‌సోర్సింగ్ కంపెనీలు కార్మికులకు నిజంగా నిబంధనల మేరకు వసతులు కల్పిస్తున్నారా? వేతనాలు చెల్లిస్తున్నారా? నిబంధనలను సక్రమంగా పాటిస్తున్నారా? లేదా అన్నదాని పై తప్పని సరిగా సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన జరపాలని స్పష్టమైన ఆదేశాలిచ్చారు. మరో సారి ఇలాంటి అసంపూర్తి సమాచారంతో సభలకు హాజరు కావద్దంటు హితవుపలికారు. అదే సమయంలో ఆగ్రహానికి గురైన మంత్రి సమాచారం లేకుండా సమావేశాలకు ఎందుకు టైమ్‌పాస్ చేయడానికొచ్చారా? అంటు నిలదీశారు. అనంతరం వివిధ జిల్లాల్లో కార్మికులకు ప్రభుత్వ పరంగా అందజేస్తున్న సంక్షేమ పథకాలు తదితర వాటి గురిచి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

అబద్ధాలు చెప్పడమే మోదీ పని: మంత్రి

ఓట్ల కోసంవ ప్రజలను అనేక రీతిల్లో మభ్య పెడుతూ అబద్ధాలు చెప్పడం తప్పా నరేంద్ర మోదీ చేసిందేమి లేదని రాష్ట్ర కార్మిక మంత్రి సంతోష్ లాడ్ అన్నారు. కేవలం అభద్దాల ప్రచారాన్నే నమ్ముకునే ఆయన ఎన్నికల్లో గెలుపొందుతున్నారని 11 ఏళ్లలో నరేంద్ర మోదీ చేసిన అభివృద్ధి ఏమి లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ దేశానికి ఏమి చేసింది? అని ప్రశ్నించే బీజేపీ నాయకులు తాము ఈ 11 ఏళ్లలో దేశానికి ఏమి చేశారో? ముందు సమాధానం చెప్పాలన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన సోమవారం నగరంలో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ప్రణాళిక భద్ధమైన అభివృద్ధి అన్ని రంగాలను సక్రమమైన మార్గంలో నడిపిన ఘనత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలదేనన్నారు. గడచిన 11 ఏళ్లలో కేవలం ప్రజల మధ్య ఉన్న ఉద్వేగాలను సొమ్ము చేసుకుంటు విద్వేషాలు రచ్చగొడుతు అధికారం దక్కించుకోవడం తప్ప ప్రధానిగా నరేంద్ర మోదీ, బీజేపీ పార్టీ ఈ దేశానికి చేసిన మేలేమి లేదన్నారు. బాలకార్మికులను గుర్తించే పనిని ప్రభుత్వం ముమ్మరంగా చేపట్టినట్లు తెలిపారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

కంప్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు అందించే ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సముదాయ ఆరోగ్య కేంద్రం అధికారి రవీంద్ర కణికేరి తెలిపారు. కంప్లి పట్టణంలో సోమవారం దివ్యాంగులకు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత నేత్రచికిత్స కల్పించారు. ఇందులో డాక్టర్ ఆంజనేయ ప్రసాద్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోగులకు పరీక్షలు నిర్వహించామని, మెరుగైన చికిత్స నిమిత్తం బళ్లారిలో మెరుగైన చికిత్స అందిస్తామని తెలిపారు. ప్రతి 30 రోజులకొకసారి ఉచిత ఆరోగ్య శిబిరం జరుగుతుందని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని ఆరోగ్యంగా మెరుగుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, డాక్టర్ నందీష్,డాక్టర్ హారిక, డాక్టర్ ప్రకాష్, ఉమాపతి గౌడ, రాధ, రాణి, రమేష్, దివ్యాంగ సంఘం పదాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

హోసూరు జోన్

నేడు విద్యుత్ కోత

హోసూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): హోసూరు, డెంకణీకోట సబ్‌స్టేషన్లలో మంగళవారం అత్యవసర మరమ్మతు పనులు చేపడుతున్న కారణంగా విద్యుత్‌కోత ఏర్పడనుంది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని హోసూరు పవర్ బోర్డు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కుమార్ తెలిపారు. శ్రీనగర్, కామరాజకాలనీ, అన్నానగర్, టైటాన్ ఇండస్ట్రీస్, అశోక్‌లైలాండ్, సిప్‌కాట్1, హౌసింగ్‌కాలనీ, దర్గా, నేతాజీ నగర్, బాలాజీనగర్, చిన్నయలసగిరి, ఆనందనగర్, శాంతపురం, అరసనట్టి, సూర్యనగర్, అన్నామలై నగర్, కృష్ణనగర్, మత్తిగిరి, టైటాన్, గాడిపాళ్యం, పాతమత్తిగిరి, యడేనల్లూరా, లక్ష్మీనరసింహ నగర్, కృష్ణానగర్, బొమ్మండపల్లి, పంచాక్షీపురం, అలసట్టి, మారసంద్రం, నొగనూరు, కుందుకోట, అందేవనపల్లి, అంచెట్టి, ఉరిగం, తగ్గట్టి, ఒసట్టి, కందకనపల్లి, బాలేతోటనపల్లి, సెట్టిపల్లి, బేలూరు, మరుదనపల్లి, తంద్రి, బెణంగూరు, తిమ్మసందిరం, అర్సకుప్పం, బి.అగ్రహారం, కదుమంజూరు, పుదుపట్టి, ముగలూరు, కొప్పకరై, దేవనంపట్టి కిట్టంపట్టి, పెట్టంపట్టి, వేప్పలంపట్టి, లక్ష్మీపురం, ముట్టంపట్టి, దిన్నూరు, ఎడవనహళ్లి చుట్టుపక్కల ప్రాంతాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

అదియమాన్ కళాశాలతో ఒప్పందం

హోసూరు, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): అదియమాన్ కళాశాల ఆఫ్ ఇంజనీరింగ్, (ఏఎస్ఈఎం) ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ సెంటర్‌తో అంతర్జాతీయ అవగాహన ఒప్పందం సెంటర్ ఫర్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ మధ్య ఒప్పందం కుదిరింది. ఏఎస్ఈఎం ఎల్ఎల్‌సీ సెంటర్ చైర్మెన్ డాక్టర్ సీమన్ ఒదుమా, హోసూరు అదియమాన్ కళాశాల ప్రతినిధులు పాల్గొని సంతకాలు చేశారు. డా.ఆర్.రాధకృష్ణన్ ద్వారా జీవితకాల అభ్యాస భాగస్వామ్యంగా కలిసి పని చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. జీవితకాల అభ్యాస పరిశోధన, విధాన రూపకల్పనను ప్రోత్సహించడంలో సహకారం, భాగస్వామ్యం కోసం ఒక పనిని రూపొందించడానికి కూడా అవగాహన ఒప్పందంతో పరస్పర ప్రయోజనాలను సృష్టించడం లక్ష్యంగా పెట్టుకుంది. జీవితకాల అభ్యాసాన్ని ప్రోత్సహించడంలో ఆసక్తి ఉన్న వాటాదారులకు దృశ్యమానత, భాగస్వామ్యం కల్పించడం, సంస్థలు ప్రారంభించిన ప్రోగ్రామ్‌లు, శిక్షణ మార్పిడికి దోహదపడనుందన్నారు.


ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఇరు సంస్థల ప్రముఖులు


న్యాయం చేయాలని రైతుల డిమాండ్


సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

హోసూరు, జనవరి 20(ఆంధ్రజ్యోతి): హోసూరు శూలగిరి నంజనేటి గ్రామంలో రెండు ఎకరాల క్యారెట్ పంట కాలిపోయిందని, భూమికి సమీపంలో రసాయన వ్యర్థాలను పారబోసిన కార్పొరేట్ సంస్థలపై తగిన చర్యలు తీసుకోవాలని ఓ రైతు కృష్ణన్ హోసూరు సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. శూలగిరి సర్కిల్ పరిధిలోని సామనపల్లి రెవెన్యూ గ్రామం నంజనేటికి చెందిన కృష్ణన్ 2024 నవంబరు 11న కృష్ణగిరి జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన రైతుల ఫిర్యాదుల పరిష్కార సమావేశంలో సమస్యను విన్నవించానన్నారు. ఈ ప్రాంతంలో మూడు చిన్న సూక్ష్మ పరిశ్రమలు నిర్వహిస్తున్నారని కానీ ఎవ్వరు ఏ చర్యలు తీసుకోలేదని అందుకే మళ్లీ వినతిపత్రం ఇస్తున్నట్టు తెలిపారు. చుట్టు ప్రాంతాల సంస్థల నుంచి విడుదలయ్యే రసాయన వ్యర్థాలను ట్యాంకర్ లారీల ద్వారా అడవికి ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో వేయడంతో బోరు బావులలో నీరు కలుషితమైందన్నారు. సాగు చేసిన పంటల వ్యర్థాల కారణంగా క్యారెట్, బీన్సు, క్యాబేజీ పంటలు కాలిపోయాయన్నారు. పరిహారం కల్పించి ఆదుకోవాలని కోరారు. రైతు కృష్ణన్ తన భార్య మునిరత్నతో కలిసి హోసూరు సబ్ కలెక్టర్ ప్రియాంకకు వినతిప్రతం అందించారు.

అంతులేని వంతెన కష్టాలు..!

కంప్లి, జనవరి 20(ఆంధ్రజ్యోతి): దరోజీ వద్ద కొత్త దరోజీ నుంచి తోంరణగల్లుకు వెళ్లు రోడ్డు మార్గంలో నిత్యం రైలు వంతెన కింద ఇరుకు మార్గంలో ప్రయాణం చేస్తూ తమ పనులకు జిందాల్ సిబ్బంది, రైతులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని సంవత్సరాలుగా కంప్లి, దేవలాపురం, దరోజీ, సిద్దమ్మనహళ్లి, సుగ్గినళ్లి భాగాలలో రైతులు, ప్రజలు, జిందాల్ సిబ్బంది ఎంత ఇరుకైన వంతెన ఉన్నా అలాగే వెళుతూ విధులకు వెళ్తున్నారు. కేవలం రెండు కిలోమీటర్లు మాత్రమే వుండటంతో ఈ మార్గాన వెళుతున్నారు. చుట్టూ తిరిగి రావాలంటే 15 కిలోమీటర్లు తిరిగి రావాల్సిందే. గతంలో ఈ విషయంపైన ఎంపీ తుకారామ్ అక్కడి వరకు రోడ్డు ఏర్పాటు చేశారేగానీ, రైల్వే శాఖతో చర్చించి అక్కడ రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైల్వే శాఖ అధికారులు ఇప్పటికీ ట్రాక్ పైన గానీ, బ్రిడ్జి కిందగానీ ప్రయాణానికి అనుమతులు ఇవ్వకపోవడంతో కష్టాలు తప్పడం లేదని జేఎస్ డబ్ల్యూ ఉద్యోగి నటరాజు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో షిఫ్ట్‌లు ముగించుకుని వచ్చే సమయంలో చాలాసార్లు ఈ ప్రాంతాల్లో ఎలుగుబంట్లు, చిరుతలు కనిపించిన సందర్భాలున్నాయని వాపోతున్నారు. ఉద్యోగులు కలసికట్టుగా ఇక్కడకు చేరుకుని తమ గ్రామాలకు వెళుతుంటామని తెలిపారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే ఎంపీజిందాల్ ఉద్యోగులు, రైతులు, ప్రజల ఇబ్బందులను దృష్టిలో వుంచుకుని సమస్య పరిష్కరించాలని కోరారు.


తోరణగల్లు నుంచి దరోజీ వైపు వెళ్తున్న జేఎస్‌డబ్ల్యూ సిబ్బంది

ట్రాక్ ప్లాన్ మార్చాలని రైతుల డిమాండ్


నిరసన తెలుపుతున్న రైతులు

బళ్లారి సిటీ/రూరల్, జనవరి 20(ఆంధ్రజ్యోతి): జిందాల్ కోసం వేయనున్న రైల్వే ట్రాక్ ప్లాన్‌ను మార్చాలని రైతులు డిమాండ్ చేశారు. హద్దినగుండు నుంచి హకుంది వరకు నూతన రైలు మార్గాన్ని నిర్మించాలని కోరుతూ ఆంద్రాల్, బి.గోనాల్, బొబ్బకుంట తదితర గ్రామాల రైతులు సోమవారం జిల్లా కలెక్టర్ ఆవరణలో నిరసన తెలిపి జిల్లాకలెక్టర్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈరైల్వే లైన్ నిర్మాణం కోసం సర్వే పనులు జరుగుతున్నాయి. ఈ ప్రాంతం నగర పరిధిలోకి వస్తుంది. కాబట్టి తమకు జీవనాధారమైన 1లేదా 2ఎకరాల కంటే తక్కువ భూమి ఉందని, ఇక్కడ పెద్ద సంఖ్యలో ఎస్సీ ఎస్టీలు, చిన్నకారు రైతులున్నారు. ఈ ప్రాంతంలో రైల్వే లైన్ వేస్తే జీవనాధారం కోల్పోతో మన్నారు. ఇప్పటికే బళ్లారి చుట్టుప్రక్కల భూములను రింగ్‌రోడ్డు, బైపాస్ రోడ్డుకు ఇచ్చి ఇబ్బందులు పడుతున్నామన్నారు. అందుకు గ్రామీణ ప్రాంతమైన హగరి రైల్వేస్టేషన్ దాటిన తర్వాత ఓబులాపూర్ సమీపంలోని రైల్వే ట్రాక్‌కు సరిపడేలా ట్రాక్‌రూట్ (హగరి దాటిన తర్వాత ఓబాలపూర్ మార్గం) ను రింగ్ ప్యాటర్న్‌గా మార్చాలని రైల్వే మంత్రికి వినతి పత్రం అందించారు.

అలరించిన కవి సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న సాహితీవేత్తలు

బళ్లారి సిటీ, జనవరి 20(ఆంధ్రజ్యోతి): నగరంలోని విష్ణువర్ధన్ వేదికలో కవన్ ప్రకాశ్, కన్నడ సాహిత్య పరిషత్ బళ్లారి తాలూకా యూనిట్ సహకారంతో డస్ట్‌బిన్ పై కవి సమ్మేళనం సోమవారం నిర్వహించారు. కవిసమ్మేళనానికి అధ్యక్షత వహించిన సాహితీవేత్త డా.రాజశేఖర్ జమదండి మాట్లాడుతూ ఈ కార్యక్రమం వినూత్నంగా, విశిష్టంగాఉందని, పరికిరాని పనికిమాలిన వస్తువును కవిత్వానికి రూపకం రాయడం సవాల్ అని, ఇలాంటి ఆలోచనలు బళ్లారిలో చర్చకు రావడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. పద్యాలకు చందస్సు అసరం లేదు. పనికి రాని అంశాలతో నిండిన డబ్బే చాలా మంది చర్చలకు గురికావడం ఆశ్చర్యకరమన్నారు. ఈ భూమి మీద ఉన్న వస్తువులన్నీ పనికిరాని విషయాన్ని కవి లోతుగా చూస్తాడన్నాడు. కవులందరి కవిత్వం విన్న శ్రీమతి కవితా విరూపాక్ష కవిత్వం మన దృష్టిని ఆకర్షించిందన్నారు. కార్యక్రమం ప్రారంభంలో జయశ్రీ, కవి సమ్మేళనానికి విచ్చేసిన అతిథులు, కవులకు విష్ణువర్ధన్ వేదిక కవి అజయ్ బణకార్ స్వాగతం పలికారు. కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు నిష్టరుద్రప్ప, తాలూకా విభాగ అధ్యక్షుడు నాగిరెడ్డి పాల్గొన్నారు.

పొలాల్లోనే వదిలేశారు..


విరగగాసిన టమోటా పంట

కంప్లి, జనవరి 20(ఆంధ్ర జ్యోతి): టమోటా రైతులకు కష్టాలు కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. మార్కెట్లో ధరలు లేకపోవడంతో రైతులు పంటలు కోసేందుకు కూడా వెనకాడుతున్నారు. కాయలను తెంచడానికి కూలీలకు అయ్యే ఖర్చు కూడా తిరిగి రాదని పొలాల్లోనే పంటను వదిలేస్తున్నారు. మార్కెట్లో టమోటా ధర కిలో రూ.5 మాత్రమే పలుకుతుండంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటను కోసే కూలీలకు రోజుకు రూ.350 ఇవ్వాల్సి వస్తుండటంతో రైతులు పంటను పొలంలోనే వదిలేస్తున్నారు. దేవసముద్రం క్రాస్ వద్ద రైతు తనకున్న రెండు ఎకరాలలో టమోటా పంట సాగుచేశారు. పంట పుష్కలంగా వచ్చింది. తెగుళ్లు సోకడంతో ఈ సారి మందుల కోసం కూడా అధికంగా ఖర్చు చేశానని రైతు తెలిపారు. ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు చేశామన్నారు. పిచికారి మందులు, రసాయనిక మందులు, కూలీలకు అధికంగా ఖర్చయ్యిందన్నారు. మంచిగా పంట పండిందని ఈ సారి లాభాలు వస్తాయనుకునే సమయంలో ఒక్కసారిగా మార్కెట్లో ధరలు తగ్గుముఖం పట్టడంతో ఈ పంటలో కూడా నష్టాలే చవి చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. కనీసం పెట్టిన పెట్టుబడి కూడా వెనక్కు రాని పరిస్థితి నెలకొంది. ఇతర పంటలతోపాటు టమోటా పంట కూడా ఈసారి కష్టాలను మిగిల్చిందని అందుకే పొలాల్లోనే వదిలేసినట్లు తెలిపారు.

దివ్యాంగ విద్యార్థులకు సైకిళ్లు ఇవ్వాలి

● రైతు సంఘం తాలుకా అధ్యక్షుడు చెన్నప్ప


దివ్యాంగ విద్యార్థిని బైక్‌పై కూర్చో బెడుతున్న చెన్నప్ప

కంప్లి, జనవరి 20(ఆంధ్ర జ్యోతి): దివ్యాంగ విద్యార్థులకు మూడు చక్రాల సైకిళ్లు అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతు సంఘం హసురుసేన (జే కార్తీక్)తాలుకా అధ్యక్షుడు చెన్నప్ప ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం 9వ వార్డుకు చెందిన జయరాముడు అనే విద్యార్థి ఎస్ఎన్‌పేట ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. విద్యార్థి దివ్యాంగుడు. పాఠశాల నుంచి ఇంటికి సాయంత్రం వేళ ఇబ్బందులు పడుతూ వెళ్లడం గమనించిన చెన్నప్ప ఆ విద్యార్థిని బైకుపై ఇంటికి చేర్చారు. ఈ సందర్భంగా ఆయన అధికారులు దివ్యాంగ విద్యార్థులను గుర్తించి ఆదుకోవాలన్నారు. ఎంతో మంది దివ్యాంగులు సౌకర్యాలు లేక చదువులకు దూరమవుతున్నారు. వీరిని ఆదుకునేందుకు ప్రజాప్రతినిధులు ముందుకు రావాలని కోరారు.

అధికారుల వేధింపులపై వ్యాపారుల నిరసన

రాయచూరు జనవరి 20(ఆంధ్రజ్యోతి): నగరంలో వీధి వ్యాపారాలు చేసుకుంటున్న వారిని వేధింపులకు గురి చేయకుండా అధికారులు అడ్డుకట్ట వేయాలని వీధి వ్యాపారులు కోరారు. రోడ్ల వెడల్పు పేరుతో వీధి వ్యాపారుల పట్ల అధికారులు వ్యవహరిస్తున్న తీరు పై తీవ్ర అసంతృప్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల తీరును నిరశిస్తు సోమవారం నగరంలోని టిప్పుసుల్తాన్ గార్డన్ వద్ద కర్ణాటక వీధి వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపారులు రోడ్ల వెడల్పులో ఉపాధి కోల్పోతున్న వీధి వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలాలు చూపాలన్నారు.


టిప్పుసుల్తాన్ గార్డెన్‌లో ఆందోళన చేస్తున్న వ్యాపారులు